

దర్శించండి - తరించండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి

శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్

A/c No. 30178925930, IFSC No. SBIN0010105

మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 291 | ది. 30-1-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 291 | Date : 30-1-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


## అజిత్ పవార్ అంత్యక్రియలకు హాజరైన మంత్రి నారా లోకేష్



**ముంబై,జనవరి 29 (వార్తాప్రభ) :** మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ భౌతికకాయాన్ని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ సందర్శించి నివాళులు అర్పించారు. బారామతిలో నిర్వహించిన అజిత్ పవార్ అంత్యక్రియల్లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. దివంగత అజిత్ పవార్ కు నివాళులర్పించిన వారిలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీనేత లావు కృష్ణదేవరాయలు, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి ఉన్నారు.

# 2027 నాటికి బెంగుళూరు-విజయవాడ ఎకనామిక్ కారిడార్

- రవాణా వ్యయం తగ్గించేలా రాష్ట్రంలో రహదారి ప్రాజెక్టులు
- ఏపీలో 2029 నాటికి రూ.1.4 లక్షల కోట్ల ఎన్‌హెచ్ పనులు పూర్తి లక్ష్యం
- ఓడరేవులు, ముఖ్యమైన ప్రాంతాలను అనుసంధానిస్తూ రోడ్ల నిర్మాణం
- రాష్ట్రంలో జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీశాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష



**అమరావతి,జనవరి 29 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో ప్రస్తుతం చేపట్టిన రూ.1.40 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులు 2029 నాటికి పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల సంస్థ, కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ చేపట్టిన వివిధ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో గురువారం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారి ప్రాజెక్టులపై సీఎం సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారుల నెట్వర్క్ విస్తరణ, రాష్ట్ర రహదారులు, రోడ్ డెన్సిటీ పెంపు, ప్రస్తుతం ఏపీలో చేపట్టిన ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పురోగతి, కొత్త రహదారుల నిర్మాణం తదితర అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. సరుకు రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించటమే లక్ష్యంగా రాష్ట్రంలో రహదారి ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం ఓడరేవులను ఈ జాతీయ రహదారులతో అనుసంధానించాలని సూచనలు జారీ చేశారు. ఈ పోర్టులకు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా సరుకు రవాణా చేసేలా హింటర్ ల్యాండ్‌ను కనెక్టు చేసేలా రోడ్లు నిర్మించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టులను పూర్తి చేసే విషయంలో దేశంలోనే ఏపీ బెంచ్ మార్క్ గా ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం రెండు లేన్లుగా ఉన్న జాతీయ రహదారులను 4 లేన్లుగా, 6 లేన్లుగా మార్చేందుకు ప్రణాళికలు చేపట్టాలని సీఎం సూచించారు. ప్రస్తుతం రూ.42,194 కోట్ల విలువైన జాతీయ రహదారుల నిర్మాణం పురోగతిలో ఉన్నాయని వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాజధాని అమరావతిని అనుసంధానించే బెంగుళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ పనులు 2027 కల్లా పూర్తి కావాలని సూచించారు. ఖరగ్ పూర్- అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ వే కూడా త్వరలోనే డీపీఆర్ లు సిద్ధం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి అయితే ప్రజలకు తక్షణం ప్రయోజనం కలుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సిన వివిధ రోడ్డు ప్రాజెక్టులకు కూడా అనుమతులు తీసుకుని వేగంగా పనులు చేపట్టాలని సూచించారు. కేంద్రానికి ఇవ్వాల్సిన ప్రతిపాదనల్ని కూడా తక్షణమే సమర్పించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని నాగ్ పూర్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం, రాయపూర్- అమరావతి, మూలపేట పోర్టు జగదల్ పూర్, రాయపూర్‌లను కూడా అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలని సీఎం నిర్దేశించారు.

# సమ్మక్క-సారక్క జాతర గిరిజనుల మహాకుంభం

– కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం



**హైదరాబాద్,జనవరి 29 (వార్తాప్రభ) :** మేడారం సమ్మక్క-సారక్క జాతర సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం, కేంద్ర బొగ్గు ద గనుల శాఖ మంత్రి శ్రీ జి.కిషన్ రెడ్డి ప్రత్యేకంగా ఆలయాన్ని సందర్శించి సమ్మక్క-సారలమ్మ తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆలయ ప్రధాన ద్వారం వద్ద కేంద్ర మంత్రులకు ఘన స్వాగతం పలికారు. గిరిజన సంప్రదాయ డోలు-డప్పుల నడుమ ఆలయంలోకి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తల్లులకు నిలువెత్తు బంగారం సమర్పించి మొక్కులు చెల్లించారు. తదనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జువల్ ఓరం మాట్లాడుతూ, "సమ్మక్క-సారక్క జాతర దేశంలోనే అతిపెద్ద గిరిజన పండుగ. ఇది గిరిజనుల మహాకుంభంగా నిలుస్తోంది. సుమారు 20 ఏళ్ల క్రితం నేను ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశాల మేరకు మళ్లీ ఈ పవిత్ర జాతరకు రావడం ఆనందంగా ఉంది" అని అన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు అందిస్తోందని తెలిపారు. జాతర నిర్వహణకు సహకరిస్తూనే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకు పాత మిత్రులని, పార్లమెంటులో కలిసి పనిచేసిన అనుభవం ఉందని గుర్తు చేశారు.

**గిరిజన సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.** ధర్తీ ఆబా గిరిజన గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద 1 లక్ష కోట్లు, పీఎం జన్-మన్ యోజన కింద 24,000 కోట్లు, తెలంగాణకు 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు మంజూరు అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో గిరిజన వ్యవహారాల ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటై, తొలి క్యాబినెట్ మంత్రిగా తాను బాధ్యతలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. భగవాన్ బిర్సా ముండా వంటి గిరిజన వీరుల త్యాగాలను దేశం గౌరవిస్తోందని అన్నారు.

# వన్యప్రాణి సంరక్షణలో కార్పొరేట్లు భాగస్వాములు కావాలి

- జంతువుల సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరు స్వీకరించాలి
- విశాఖ జూ పరిశీలన సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు
- తల్లి శ్రీమతి అంజనాదేవి జన్మదినం సందర్భంగా జిరాఫీలు దత్తత
- ఏడాదిపాటు వాటి పోషణ ఖర్చులు భరిస్తానని ప్రకటన
- విశాఖ జూ పార్క్ ఆద్యంతం పరిశీలించిన పవన్ కళ్యాణ్



**విశాఖపట్నం,జనవరి 29 (వార్తాప్రభ) :** పర్యావరణ సమతుల్యత, స్థిరత్వానికి వన్యప్రాణి సంరక్షణ చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరు వన్యప్రాణి సంరక్షణలో భాగం కావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు నిచ్చారు. తన తల్లి శ్రీమతి అంజనా దేవి జన్మదినాన్ని పురస్కరించుకొని విశాఖ ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్ లో రెండు జిరాఫీలను దత్తత తీసుకున్నారు. ఏడాది పాటు వాటి సంరక్షణకు అయ్యే ఖర్చును భరించ నున్నట్టు ప్రకటించారు. గురువారం ఉదయం విశాఖ జూ పార్కును పవన్ కళ్యాణ్ పరిశీలించారు. జూ పార్క్ లో జంతువుల సంరక్షణ నిమిత్తం ప్రస్తుతం ఏర్పాటు చేసిన సౌకర్యాలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జూపార్క్ ను మరింత అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై అటవీశాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మన దేశంలో వన్యప్రా ణుల సంరక్షణ అంశంలో జూపార్కులు చాలా ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. అంతరించిపోతున్న జీవ జాతులను రక్షిస్తున్నాయి. ప్రశాంతమైన వాతావరణంలో సుమారు 650 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న విశాఖ జూపార్క్ లో వందలాది వన్యప్రాణులు, పక్షులు ఆహ్లాదకర వాతావరణం మధ్య జీవిస్తున్నాయి. వాటిని సంరక్షణ మనందరి బాధ్యత. జూ పార్కుల అభివృద్ధిలో కార్పొరేట్లు భాగస్వాములు కావాలి. తమకు నచ్చిన జంతువును ఎంచుకొని వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి. మా కుటుంబం మొత్తం జంతు ప్రేమికులం. జంతు సంక్షణపై చాలా శ్రద్ధపెడతాం. మా ఇంట్లో నాలుగు కుక్కలను పెంచుతున్నాం" అన్నారు.

**జూ పార్క్ మొత్తం కలియదిరుగుతూ.. జంతువుల వివరాలు తెలుసుకుంటూ..** అంతకు ముందు విశాఖ ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కును పవన్ కళ్యాణ్ పరిశీలించారు. మొదట జూ వెనుక గేటుకి సమీపంలో ఉన్న సీతాకోక చిలుకల పార్కును సందర్శించారు. పార్కులో ఎన్ని రకాల సీతాకోక చిలుకలు ఉన్నాయి వలల మధ్య ఉన్న వాటికి ఆహారం ఎలా అందిస్తారు. తదితర వివరాలు జూ క్యూరేటర్ మంగమ్మను అడిగి తెలుసుకున్నారు. అటవీశాఖ అధికారులు బటర్ ఫ్లై పార్క్ లో వదిలేందుకు సేకరించిన వివిధ రకాల సీతాకోక చిలుకలను పవన్ కళ్యాణ్ పార్కులోకి విడుదల చేశారు. టైగర్ రకానికి చెందిన సీతాకోక చిలుకలు ఆయనపై దుస్తులపై వాలగా, వాటిని సున్నితంగా పూల మొక్కల పైకి మళ్లించారు. అనంతరం జూ పార్క్ లో ఉన్న నీటి ఏనుగులను పరిశీలించారు. వాటికి ఇచ్చే ఆహారం, జూ అధికారులు వాటికి పెట్టిన పేర్లు, సంరక్షణలో తీసుకుంటున్న జాగ్రత్తలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ఎలుగుబంట్ల ఎన్ క్లోజర్ ప్రారంభోత్సవం..** జూలో నూతనంగా ఎలుగుబంట్ల కోసం ఏర్పాటు చేసిన ఎన్ క్లోజర్ ను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. జూలో ఉన్న రెండు నల్ల ఎలుగుబంట్ల వివరాలు తెలుసుకుని, వాటికి ఆహారం అందించారు. జింకలపార్క్, జూలో ఉన్న సింహాలు, ఆఫ్రికన్ మకావు జాతి చిలుకలు, పులులను తిలకించారు. వారి రక్షణకు తీసుకుంటున్న చర్యలు, జూలో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై చర్చించారు. జూ పార్క్ లోని ఏనుగుల శాలను సందర్శించారు. జూ నిబంధనలు పాటిస్తూ శానిటైజ్ చేసుకుని ఏనుగుల వద్దకు వెళ్లి వాటికి ఆహారం అందించారు.

# రూ.6 వేల కోట్ల ట్రాన్స్ కో ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేయాలి

- భవిష్యత్తు విద్యుత్ అవసరాలను అందుకోవాలి
- డిమాండ్ కు తగిన విధంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరగాలి
- ట్రాన్స్ కో ప్రాజెక్టుల సమీక్షలో మంత్రి గొట్టిపాటి



**అమరావతి,జనవరి 29 (వార్తాప్రభ) :** ట్రాన్స్ కో ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.6 వేల కోట్లతో చేపట్టిన వివిధ విద్యుత్ ప్రాజెక్టులను నిర్ణీత కాల వ్యవధిలోపు పూర్తి చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలులో ఉన్న ట్రాన్స్ కో ప్రాజెక్టుల పురోగతిపై సచివాలయంలో గురువారం నాడు సమీక్ష నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధ్యక్షతన జరిగి ఈ సమీక్ష సమావేశంలో సీఎస్ విజయానంద్, టాన్స్ కో జేఎండీ సూర్య సాయి ప్రవీణ్ చంద్ పాల్గొన్నారు. ఈ సమీక్షలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న వివిధ ట్రాన్స్ కో ప్రాజెక్టుల వివరాలను అధికారులను మంత్రి గొట్టిపాటి అడిగి తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రారంభించి పెండింగ్ లో ఉన్న వాటి వివరాలను కూడా అధికారులు మంత్రికి తెలిపారు. పాత ప్రాజెక్టులతో పాటు ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను అన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను అందుకునే విధంగా ప్రాజెక్టులన్నీ నిర్ణీత కాల వ్యవధిలో కాంట్రాక్టర్లు పూర్తి చేసేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ వినియోగం, ఉత్పత్తి, సరఫరా వంటి అంశాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. సీఆర్డీఏ పరిధిలో అమరావతి రాజధాని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో ఆ పనులను కూడా శాకాధికారులతో సమన్వయం చేసుకుని విద్యుత్ శాఖ అధికారులు ముందుకు సాగాలన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఉత్తమ స్థాయిలో టాన్స్ మిషన్ నెట్ వర్క్ ను ఏర్పాటు చేసేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో కీలక సబ్ స్టేషన్ల నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకొచ్చామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వివరించారు. ప్రజలు, రైతులతో పాటు వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు నాణ్యమైన విద్యుత్ ను నిరంతరం సరఫరా చేయాలనే లక్ష్యంతో పని చేయాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి దిశా నిర్దేశం చేశారు.

## దేవదాయ - ధర్మదాయ శాఖ

### చేపల చెరువు లీజు టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన

దేవదాయ - ధర్మదాయ శాఖ, కృష్ణాజిల్లా, నందివాడ (మండలం), దండిగానపూడి గ్రామములో గల శ్రీ ధర్మచెరువులు కు సర్వ సంపూర్ణ హక్కు భుక్తములు కలిగిన ఈ క్రింది పేర్కొన్న షెడ్యూలు దాఖలా మొత్తం య. 10-00 సెంట్ల చేపల చెరువులయందు చేపలు వేసి పెంచుకొనుటకుగాను లైసెన్స్ లీజు హక్కు ది. 4-2-2026 తేది నుండి ది.3-2-2029 వరకు అనగా 3 సంవత్సరములు లీజు కాలపరిమితికి గాను ది.4-2-2026 తేది బుధవారం ఉదయం 11:00 గంటలకు దండిగానపూడి గ్రామంలో శ్రీ ధర్మచెరువులు వద్ద దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో కార్యనిర్వహణాధికారిచే బహిరంగ వేలంపాట నిర్వహించబడును.

| వ.నెం. | చెరువు వున్న గ్రామము | ఆర్.ఎస్.నెం. | విస్తీర్ణం | ధరావత్తు | లీజు కాలము |
|---|---|---|---|---|---|
| 1. | దండిగానపూడి | 187/101ఎ | 5-00 | 10,000 | ది. 4-2 -2026 నుండి |
| 2. | దండిగానపూడి | 187/101 | 5-00 | 10,000 | ది. 3-2-2029 వరకు |
| | | | **10-00** | | 3 సం॥లు |

**ముఖ్యమైన షరతులు**

1. ఈ వేలంపాట దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ఉత్తర్వులకు లోబడి జరుగుచున్నది.
2. పాటను ఏ కారణంచేతనైన నిలుపుదల చేయుటకు వాయిదా వేయుటకు అధికారులకు అధికారము కలదు. రెవెన్యూ దేవదాయశాఖ జి.ఒ.నెం. 426 తేది. 9-11-2015 ప్రకారము ప్రతి సంవత్సరము 10% పెంపుదల ప్రకారము పాట మొత్తం చెల్లించు నిర్ణయం.
3. పాటదారుడు రూ. 50,000/-లు ధరావత్తుగా చెల్లించి రూ. 5,00,000/- కిమ్మత్తు గత ఏదైనా స్థిరాస్థి ఒరిజినల్ దస్తావేజులతో పాటు వారియొక్క ఆధార్ కార్డు నకలు సమర్పించి పాట పాల్గొను నిర్ణయం.
4. పాట పూర్తి అయిన వెంటనే హెచ్చు పాటదారుడు హెచ్చుపాట మొత్తమును చెల్లించి తగు రశీదు పొందు నిర్ణయం. అట్లు చేయని యెడల హెచ్చుపాట దారుని ధరావత్తు అపరాధ రుసుం క్రింద సంస్థ పేరున జమచేసుకొని తిరిగి వేలంపాట నిర్వహించబడును.
5. హెచ్చుపాటదారుడు ప్రతి సంవత్సరము ముందస్తుగా పాట మొత్తంను చెల్లించు నిర్ణయము.
6. పాట పూర్తి అయిన వెంటనే హెచ్చుపాటదారుని ధరావత్తు తప్ప మిగిలిన ధరావత్తు తప్పు మిగిలిన ధరావత్తులు తిరిగి ఇవ్వబడును. హెచ్చుపాటదారుడు రెవెన్యూ శిస్తును సంస్థ పేరున పాటదారే చెల్లించు నిర్ణయం.
7. సంస్థకు బకాయిలు వున్నవారు వేలం పాటనందు పాల్గొనుటకు అనర్హులు.

**మిగిలిన పాట షరతులు పాట కాలమందు తెలియపరచబడును.**

ఇట్లు

సం॥ **కందుల వేణుగోపాలరావు,** బి.కాం.

కార్యనిర్వహణాధికారి,

శ్రీ ధర్మ చెరువులు, దండిగానపూడి గ్రామము

నందివాడ మండలం, కృష్ణాజిల్లా

దండిగానపూడి

తేది: 23-01-2026

**In the Court of the Hon'ble II Addl. Senior Civil Judge, Vijayawada**

I.P. No. 84/2024

Between :

Dhanala Sravana Sandhya ... Petitioner

And

1. Tupakula Durga Bhavani @ Vaddadi Durga Bhavani
2. Kotari Bajji Amareswara Rao ... Respondents

To

**R-2)** : Kotari Bajji Amareswara Rao, S/o. Ramanjaneyulu, Hindu, Age : 39 Years, R/o. D.No. 18/206, Pedayerikapadu, Gudivada-521301

పై నెంబరు I.P. పిటిషనులో 2వ Respondent అయిన మీరు ఎన్ని పర్యాయములు శ్రీ కోర్టు వారు పంపిన Summons తీసుకొనక కాలయాపన చేయుచుండుట వలన శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం పేపరు ప్రచురణ ద్వారా ది. 11-02-2026 తేదీన ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసినారు. కావున ది. 11-2-2026 తేదీన ఉదయం 10.30 గంటలకు పైన తెల్పిన కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ వరోక్షముగా తీర్మానించెదరు.

**వాయిదా తేది : 11-02-2026**

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఇట్లు

**Ch. Ratna Sekhar**

**V.V. Raghavaiah**

Advocates for Petitioner

Vijayawada.

Cell No. 8247253626

29-1-2026

## కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక తిరుమల లడ్డు తయారీలో వైకాపా నాయకులు కుంభకోణాలకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచాయి

– రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



- 8లో

## మార్చి 14న జాతీయ లోక్ అదాలత్



**నూజివీడు,జనవరి 29 (వార్తాప్రభ) :** మండల న్యాయ సేవాధికార సంస్థ నూజివీడు వారి ఆధ్వర్యంలో మార్చి నెల 14 వ తేదీ అనగా రెండవ శనివారము జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నూజివీడు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ మరియు 15వ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి ఏ నాగ శైలజ గారు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసుల పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షిదారులు తమ న్యాయవాది ద్వారా ఇరు పార్టీలు హాజరు కావడం ద్వారా రాజీ కుదుర్చుకొని తద్వారా ఖర్చు,సమయం,ఆదా చేసుకోవచ్చు అని తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో రాజీకి వీలున్న అన్ని క్రిమినల్ కేసులు,బ్యాంకు రికవరీ కేసులు,ఎక్సైజ్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, మోటార్ యాక్సిడెంట్ కేసులు మొదలగునవి పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. ఇతర వివరములకు సందేహములకు నూజివీడు కోర్టు ప్రాంగణంలోని మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవలసిందిగా వారు తెలిపారు.

## 60 లక్షల కిలోల లడ్డుల్లో కల్తీ నెయ్యి ద్వారా 250 కోట్లు దోపిడీ

- తిరుమలను అపవిత్రం చేశారు
- జగన్ పైన టీటీడీ సభ్యుడు జ్యోతుల ధ్వజం




**కాకినాడ,జనవరి 29 (వార్తాప్రభ) :** గడిచిన ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానంను అపవిత్రం చేయడమే కాకుండా 60 లక్షల 10వేల కిలోల కల్తీ నెయ్యితో 20 కోట్ల లడ్డూలు తయారుచేసి 251 కోట్ల రూపాయలను దోచుకున్నారని టీటీడీ సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ) అన్నారు. తిరుమల దేవస్థానాన్ని అపవిత్రం చేసి ఎన్నో పాపాలను చేశారని అందుకే వారికి ఆ దేవదేవుడు సరైన శిక్ష వేసి రాష్ట్రంలో ఘోరంగా దింపాడని చెప్పారు. గురువారం కాకినాడలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో జ్యోతుల విలేకరులతో సమావేశమును నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతుల మాట్లాడుతూ తిరుమల తిరుపతిని అపవాదించడం కాకుండా వాళ్ళ స్వార్థ ప్రయోజనాల కోసం తిరుమలని వినియోగించుకున్నారన్నారు. పాలను వినియోగించకుండా నెయ్యిని కల్తీ చేసి 20 కోట్ల లడ్డుల విక్రయాలు చేసారన్నారు. తిరుమలలో పట్టు వస్త్రాలు నకిలీవే కాకుండా స్వామివారి ప్రసాదానికి కూడా అపవిత్రం చేశారని చెప్పారు. వైసీపీ చేసిన అక్రమాలను సరిచేస్తున్నామన్నారు. జగన్ డిక్లరేషన్ ఇవ్వలేదని అన్యమతస్తులు ప్రోత్సహించారని చెప్పారు. జగన్ ఏ యాత్ర చేసిన నెంబర్ స్థితిలో లేరని నెహ్రూ అన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) మాట్లాడుతూ జగన్ స్వామి వారి దర్శనానికి డిక్లరేషన్ ఇవ్వకుండా లడ్డూను కల్తీ చేసి నకిలీ మద్యం ద్వారా అక్రమ మార్గాలు ఆదాయాన్ని దోచుకున్నారని కొండబాబు అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో స్వామివారి దర్శనానికి ఐదుసార్లు కూడా జగన్ డిక్లరేషన్ ఇవ్వలేదన్నారు. ప్రజల వద్దకు తిరిగి జగన్ యాత్ర చేస్తే అతనిని నమ్మరని చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహన్రావు, ఉండవల్లి వీర్రాజు, గాది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పెడన లో పశు వైద్య శిబిరం



**పెడన,జనవరి 29 (వార్తాప్రభ) :** పట్టణంలో మన స్కూల్ ఆసుపత్రి నందు గురువారం నాడు పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయుట జరిగింది. ఈ కార్యక్రమము నందు శిబిరానికి వచ్చిన పశువులకు వాటి అవసరాన్ని బట్టి మినరల్ మిక్చర్ పంపిణి చేయుట జరిగినది ఈ కార్యక్రమంలో 8 వార్డు సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ ముఖ్య అధితిగా పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 2 నుంచి నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

## -శిక్షణా కేంద్ర ఇంచార్జ్ చింకా నారాయణ యాదవ్



**విజయవాడ,జనవరి 29 (వార్తాప్రభ) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో సీడ్ ఏపీ ( సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్ప్రైజ్ డెవలప్మెంట్ ఇన్ ఆంధ్రప్రదేశ్) ద్వారా నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణను ఫిబ్రవరి 2 వ తేదీ నుంచి ప్రారంభించను న్నట్లు శిక్షణా కేంద్రం ఇంచార్జి చింకా నారాయణ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. డీడీయూ జీకేవై కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల వయసు కలిగి ఉండాలన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ, బీటెక్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. వీరికి 4 నెలల పాటు కంప్యూటర్,స్పోకెన్ ఇంగ్లీష్, ఎలెక్ట్రానిక్ తదితర విభాగాలలో శిక్షణ ఇవ్వనున్నట్లు నారాయణ పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత ప్రభుత్వం చేత సర్టిఫికెట్ అందించడంతో పాటు ప్రైవేటు కంపెనీలలో రూ 14 నుంచి రూ 20000 జీత భత్యం కలిగిన ఉద్యోగాలు ఇప్పించనున్నట్లు తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజనం, యూనిఫాం, కోర్సు మెటీరియల్ ఇస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 2 వ తేదీన నేరుగా విజయవాడ సమీపంలోని కానూరు నవతా ట్రాన్స్పోర్ట్ రోడ్డులో ఉన్న సీడ్ ఏపీ శిక్షణా కేంద్రానికి చేరుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9581148566 ఫోన్ నంబర్ను సంప్రదించాలని ఇంచార్జి నారాయణ పేర్కొన్నారు.

# అంగరంగ వైభవంగా సిద్ధేంద్ర యోగి మందిర వార్షికోత్సవం..



**మొవ్వ/అవనిగడ్డ,జనవరి 29 (వార్తాప్రభ) :** కూచిపూడి యక్షగానాలలో ప్రాచుర్యం పొందిన భామాకలాపం సృష్టికర్త శ్రీ సిద్ధేంద్ర యోగి జయంతి వేడుకలు భీష్మ ఏకాదశి సందర్భంగా సిద్ధేంద్ర యోగి మందిరంలో గురువారం నిర్వహించారు .దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎస్ వి సుబ్బారావు పరోక్ష నిర్వాహణలో సిద్ధేంద్ర యోగి మందిరఆర్చకులు చింతా శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో వేకువజాము నుంచి సిద్ధేంద్ర యోగి విగ్రహానికి పురోహితులు మహంకాళి శివరామయ్య పంచామృతాలతోఅభిషేకం, అలంకరణ, అష్టోత్తర సహస్రనామాలతో అర్చన అనంతరం స్థానిక నాట్యకళాకారులు, నాట్య విద్యార్థినులు సహకారంతో గ్రామోత్సవ వేడుకలు అత్యంత వైభోగంగా నిర్వహించారు.

# ఫోటో మిషన్ విస్తరణ



**తిరువూరు,జనవరి 29 (వార్తాప్రభ) :** తిరువూరు, ప్రధమశ్రేణి గ్రంధాలయం లో చదువుకుని డీఎస్సీలో లో ఉద్యోగాలు.సాధించిన విద్యార్థులు అంజి బాబు, అక్బర్, రాణి,శాంతారావు, R.R.B లో ఉద్యోగం సాధించిన వెంకటకృష్ణ సమిష్టిగా మా గ్రంధాలయం లో పోటీ పరీక్షలకు హాజరయ్యే.విద్యార్థులకు మా సహాయం అందిస్తామని సుమారు సంవత్సరం పై నుండి ఎక్సరే మిషన్ లో పౌడర్ అయిపోయి పని చేయని కారణం గా మధ్యతరగతి విద్యార్థులు కు బయట ఫొటోస్టాట్ తీయించుకోవడానికి ఖర్చు ఎక్కువ అవుచున్నందున3965 రూ. బోర్డు,4 సుమారు 6000 రూ.ఖర్చు తో విద్యార్థులకు ఉచితం గా ఫొటోస్టాట్ తీసుకునేందుకు సహాయం చేసినారు

# అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలి

- యాప్ ల భారం తగ్గించాలి
- ఇంచార్జ్ సిడిపివో జ్యోతి కటాక్షం కి సమ్మె నోటీసు అందజేసిన ఎన్ సి హెచ్ సుప్రజ



**మైలవరం,జనవరి 29 (వార్తాప్రభ) :** అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని,యాప్ ల భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, అలాగే ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సి హెచ్ సుప్రజ,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షు లు సిహెచ్ సుధాకర్ ఐసిడిఎస్ మైలవరం ప్రాజెక్టు సిడిపివొ కార్యాలయంలో ఇంచార్జ్ సిడిపివొ డి.జ్యోతి కటాక్షం ని గురువారం కలిసి సమ్మె నోటీసులు అందజేశారు.అనంతరం సుప్రజ, సుధాకర్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ రద్దు,కర్మిక వర్గ ఇతర సమస్యలపై ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కార్యకర్తలు పిలుపునిచ్చారు. అంగన్వాడీ కార్యకర్తలు కనీస వేతనం లేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని,చాలీచాలని జీతాలుతో కుటుంబాలు గడిచే పరిస్థితి లేదన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కేంద్ర ప్రభుత్వంతో కలిసి వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారనీ, రెండు సంవత్సరాలు గడిచినా వేతనాల పెంపు ఊసే లేదన్నారు.వచ్చే బడ్జెట్ సమావేశాలలో అయినా అంగన్వాడీ వర్కర్స్ వేతనాలు పెంచాలని లేని పక్షంలో 3వ తేదీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మికవర్గంపై బానిసత్వాన్ని రుద్దటానికి 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 4 లేబర్ కోడ్ తెచ్చిందని విమర్శించా రు. లేబర్ కోడ్ ను రద్దుచేయాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు 2026 ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు.అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం ఈ సమ్మెలో పాల్గొనాలని అలిండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) కూడా నిర్ణయించిందని తెలియజేశారు.ఆ మేరకు సి ఐ టి యు రాష్ట్ర కమిటీ స్త్రీ,శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ మరియు డైరెక్టర్, జిల్లా కమిటీ ప్రాజెక్టు డైరెక్టర్ లకు సమ్మె నోటీసు అందజేయటం జరిగిందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మైలవరం ప్రాజెక్ట్ అధ్యక్ష,కార్యదర్శులు ఆర్ ఆర్ వి పుష్పకుమారి, ఎల్ పద్మ, రమాదేవి, ఝాన్సీ, రమాదేవి, యశోద, పంచాక్షరి, సునీత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాకినాడలో ప్రమాదం

- స్కూల్ పిల్లల ఆటోను ఢీకొన్న లారీ
- నాలుగవ తరగతి విద్యార్థిని మృతి
- మరో ఎనిమిది మందికి గాయాలు
- విద్యార్థుల ఆటోను ఢీకొన్న లారీ కోసం పోలీసులు గాలింపు.

**కాకినాడ, జనవరి 29 (వార్తాప్రభ) :** కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులను తీసుకు వెళుతున్న ఆటోను లారీ ఢీకొన్న ఘటనలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని మృతి చెందగా, మరో ఎనిమిది మంది విద్యార్థినిలకు గాయాలయ్యాయి. కాకినాడ రూరల్ మండలం రాయుడుపాలెం సెంటర్ సమీపంలో గురువారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే కాకినాడ రూరల్ మండలం పండూరు గ్రామంలో ఉన్న కేంద్రీయ విద్యాలయానికి ప్రతిరోజు కాకినాడ నగరంలో చదువుతున్న విద్యార్థులను ప్రైవేటు ఆటోలలో విద్యార్థులు వెళుతుంటారు. అందులో భాగంగా గురువారం ఉదయం వలసపాకల గ్రామానికి చెందిన విద్యార్థులు ఆటోలో వెళు తుండగా రాయుడుపాలెం సెంటర్ సమీపంలో గుర్తుతెలియని లారీ ఢీకొని పరార్ అయింది. ఆటోలో ఉన్న తొమ్మిది మంది విద్యార్థులకు గాను నాలుగో తరగతి చదువుతున్న రూరల్ మండలం వలస పాకల ఇందిరా కాలనీకి చెందిన కంచెపు లక్ష్మీ ఐశ్వర్య (9) తీవ్ర గాయాలు కావడంతో ఏడిబి రోడ్లో ఉన్న మెడికవర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మిగిలిన గాయాలు పాలైన విద్యార్థులను కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆటోని ఢీకొని పరారైన లారీ కోసం సర్పవరం పోలీసులు గాలిస్తున్నారు. సర్పవరం సీఐ బి పెద్దిరాజు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మార్కెట్ కమిటీ రైతులకు అండగా నిలబడాలి - ఎమ్మెల్యే నానాజీ





**కాకినాడ రూరల్,జనవరి 29 (వార్తాప్రభ) :** కాకినాడ రూరల్ మండలంలోని కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతులకు అండగాను వారి కష్టాల్లో తోడుగా ఉండాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) కోరారు. కరప మండలం నడకుదురు గ్రామంలో ఉన్న మార్కెట్ కమిటీ కార్యాలయంలో కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పాలక కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకరణ కార్యక్రమం గురువారం జరిగింది. మార్కెట్ కమిటీ చైర్మన్గా ముద్రగడ వెంకటరమణ (రమేష్), పాలకమండ సభ్యులుగా గుల్లిపల్లి శ్రీనివాసరావు, గొల్లపల్లి నాగభూషణం, గోపి రాంబాబు, పాటి సునీత, టేకు వీర దుర్గా విష్ణు, ఆచంట అంజి నాగదుర్గ ప్రవీణ్ , పోలనాటి మధు సునీల్, కుర్మరి సిరి లక్ష్మి, మాత అబ్బాయి, గండి వరలక్ష్మి, భారతి అప్పారావు, సవరపు కాంతి సుజాత, దాసరి అనూష, మేడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ, వేములవాడ సొసైటీ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్, నడకుదురు సర్పంచ్, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ తదితర సభ్యులతో కమిటీ గౌరవ అధ్యక్షుడు రూరల్ ఎమ్మెల్యే పంతం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలోనూ దళారీ వ్యవస్థను వేరు చేయడంలోనే సభ్యులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు వ్యవసాయం కమిటీలో యువతకు ప్రాధాన్యమిచ్చి వ్యవసాయాన్ని దగ్గర చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కమిటీలో 21 కోట్ల రూపాయలు నిధులు ఉన్నాయని వాటిని పంట పొలాలకు అనుసంధానంగా రోడ్లు, అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవాలని పంతం సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని వినియోగించుకుంటానని రైతులకు వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సామాన్య కార్యకర్తగా జనసేనలో తాను జీవనం ప్రారంభించానని తనకి పదవి ఇచ్చి ఉన్నత స్థానానికి చేర్చిన ఎమ్మెల్యే పంతం, పార్టీ కార్యకర్తలను మర్చిపోవాలేనని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి కార్యకర్తల మన్ననలను పొందుతానని ముద్రగడ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిక్కాల రామచంద్రరావు, కదలి ఈశ్వరి, వేటుకూరి నాగమణి, చప్పిడి వెంకటేశ్వరరావు, నురుకుర్తి వెంకటేశ్వరరావు, చిక్కాల దొరబాబు, కటకంశెట్టి బాబి, రామదేవు సీతయ్య దొర, డాక్టర్ బొండా సూర్యరావు, దేవు వెంకన్న, మట్టా ప్రకాష్ గౌడ్, రంబాల వెంకటేశ్వరరావు, మెండు గోవిందు, కొల్లాబత్తుల అప్పారావు, పెంకే లక్ష్మి, డిడిఎం సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ టి శ్రీనివాసరావు, డి స్వాతి, రెడ్డిపల్లి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు భారీ ర్యాలీగా నడకుదురులో ఉన్న మార్కెట్ కమిటీ కార్యాలయానికి వచ్చి రమేష్ బాధ్యతలు తీసుకున్నారు....

# గన్నవరం లోని వెలుగు కార్యాలయంలో చక్రం తిప్పుతున్న చిక్కవరం బుక్ కీపర్

- నిత్యం వివాదాలకు తావుగా మారుతున్న వెలుగు కార్యాలయం
- నాకు న్యాయం చెయ్యండి మహాప్రభో.
- ఎమ్మెల్యేకు రమ వేడుకోలు



**గన్నవరం,జనవరి 29 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని చిక్కవరం గ్రామానికి చెందిన సమత వివో లో అమల గ్రూపు సభ్యురాలిని కొంతకాలంగా బుక్ కీపర్ కొటేశ్వరమ్మ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని రమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.లి గత ఐదు రోజుల క్రితం కార్యాలయం అధికారి ఏపీఎం సమక్షంలో మా గ్రూపు కు సంబంధించిన లోను 6 నెలలు గడువు ఇంకా ఉండగా,ఆ లోను ను సంబంధించి నా వంతు 40 వేల రూపాయలు వెంటనే చెల్లించాలి, లోను చెల్లించిన తదుపరి వెంటనే లోన్ ఇపిస్తానని ఏపీఎం నా తరుపు పెద్ద మనుషుల సమక్షంలో హామీ ఇచ్చారు,వీరపనేని గుడెం సప్తగిరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మీ గ్రూపు కు సంబంధించిన పాత లోను క్లియర్ చేసుకుంటే మరలా లోను ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో నేను మా కుటుంబంలో మా తల్లి ఆరోగ్యం బాగోక పోయినా నేను నా అవసారాలను బట్టి నేను బయట వడ్డీ కి తీసుకువచ్చి బుధవారం వెలుగు కార్యలయం వెళ్ళాను.స్థానిక ఏపీఎం కలిసి నేను కట్టవలసిన సొమ్ము ను ఆయన సమక్షంలో బ్యాంకు లో జమ చేస్తానని తెలుపగా బ్యాంకు వద్ద గ్రూపు సభ్యులు ఉన్నారు వెళ్లి బ్యాంకు లో సొమ్ము ను జమచేసి అప్లికేషన్ ఫారం లు ఇస్తారు తీసుకుని రమ్మని ఏపీఎం అన్నారు. బ్యాంకు వద్దకు వెళ్లగా నా తోటి గ్రూపు సభ్యులు కొంతమంది వ్యక్తులతో కలిసి నాపై దాడికి పాల్పడ్డారు.నాపై దౌర్జన్యం చేసి నావద్ద ఉన్న సొమ్మును బలవంతంగా లాక్కొనే ప్రయత్నం చేశారు.అదేమని నేను బ్యాంకు మేనేజర్ ప్రశ్నించగా మా ఇష్టం వచ్చినట్టు చేస్తాం..నీకు చేతనైంది చేసుకో, ఇప్పుడు నీ వంతు సొమ్ము కట్టి వెళ్లిపో నీకు మాత్రం లోను ఇచ్చే ప్రసక్తే లేదు అని భయభ్రాంతులకు గురి చేశారు.దీంతో నేను అప్రమత్తమై నా కొడుకు సహాయం తో ప్రాణాలతో బయట పడ్డాను.ఈ విషయం పై స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఉన్నతాధికారులు స్పందించి పూర్తిగా విచారణ జరిపి నాకు తగిన న్యాయం చేయాలని సమత వివో లో అమల గ్రూపు సభ్యురాలు రమ, బాధిత వేడుకుంటున్నారు.

# దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన అవసరం - డా. పి. గురుప్రసాద్ సూచన




**విజయవాడ,జనవరి 29 (వార్తాప్రభ) :** ఆధునిక జీవనశైలిలో మనిషిని ఎక్కువగా ఆందోళనకు గురిచేస్తున్న ఆరోగ్య సమస్యలు దీర్ఘకాలిక వ్యాధులేనని ప్రముఖ ఫిజీషియన్ డా. పి. గురుప్రసాద్ అన్నారు. ఇవి ఒక్క రోజులో తగ్గిపోయేవి కావని, నెలలు--సంవత్సరాలపాటు శరీరాన్ని ప్రభావితం చేస్తూ జీవన నాణ్యతను దెబ్బతీస్తాయని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో జీవించడం, ఆరోగ్యంగా జీవించడం గురించి ప్రతి ఒక్కరికీ సరైన అవగాహన అవసరమని ఆయన పేర్కొన్నారు. వాసవ్య నర్సింగ్ హోంలో డా. సమరం అధ్యక్షతన గురువారం నిర్వహించిన 1353వ ఆరోగ్య సదస్సులో "దీర్ఘకాల వ్యాధులు" అంశంపై డా. గురుప్రసాద్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, ఆస్తమా, కొన్ని శ్వాసకోశ వ్యాధులు, క్యాన్సర్, కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఆర్థరైటిస్ వంటి వ్యాధులు దీర్ఘకాలిక వ్యాధులుగా పేర్కొన్నారు. జంక్ ఫుడ్ అధిక వినియోగం, శారీరక వ్యాయామం లేకపోవడం, మద్యపానం, ధూమపానం అలవాట్లు, మానసిక ఒత్తిడి, పర్యావరణ కాలుష్యం వంటి అంశాలతో పాటు కొన్నిసార్లు వంశపారంపర్య కారణాలు కూడా దీర్ఘకాలిక వ్యాధులకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని చెప్పారు. ఈ వ్యాధులు ప్రారంభ దశలో స్పష్టమైన లక్షణాలు కనిపించకపోయినా, కాలక్రమేణా శరీర అవయవాల పనితీరును దెబ్బతీసి, పనిసామర్థ్యాన్ని తగ్గించి, కుటుంబ జీవనంపైనా ప్రభావం చూపుతాయని వివరించారు. సమతుల ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, ధూమపానం--మద్యపాన అలవాట్లకు దూరంగా ఉండటం, మానసిక ఒత్తిడిని నియంత్రించుకోవడం, నిత్య ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా చాలావరకు దీర్ఘకాలిక వ్యాధులను నివారించవచ్చని లేదా నియంత్రించవచ్చని ఆయన సూచించారు. ఇప్పటికే వ్యాధికి గురైన వారు వైద్యుల సలహా మేరకు మందులను క్రమం తప్పకుండా వాడటం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. దీర్ఘకాలిక వ్యాధులు వ్యక్తిగత సమస్య మాత్రమే కాదని, ఇది ఒక సామాజిక ఆరోగ్య సమస్యగా మారిందని డా. గురుప్రసాద్ అన్నారు. ముందస్తు జాగ్రత్తలు, ఆరోగ్య అవగాహన, బాధ్యతాయుతమైన జీవనశైలితోనే ఈ సవాలును ఎదుర్కొనగలమన్నారు. "ఆరోగ్యం ఉంటేనే జీవితం, జీవితం ఉంటేనే సమాజం" అన్న విషయాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో పాల్గొన్న అనేక మంది తమ సందేహాలను వ్యక్తం చేయగా, నిపుణులు వాటికి స్పష్టమైన సమాధానాలు ఇచ్చారు.

# పశు ఆరోగ్య శిబిరాలు



**తిరువూరు,జనవరి 29 (వార్తాప్రభ) :** తిరువూరు మండలంలోని పలుగ్రామాలలో గురువారం పశు ఆరోగ్య శిబిరాలను పశుసంవర్ధక శాఖ ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాజుగూడెం, వావిలాల గ్రామాలలో పశుసంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హనుమంతరావు శిబిరాన్ని సందర్శించారు. పాడి రైతులకు పాలు ఉత్పత్తి పెంచడానికి మరియు ప్రభుత్వ సంక్షేమలు పశుసంవర్ధక శాఖ తరపున ఆవుల షెడ్డులు, గేదెల షెడ్లు ,మరియు దాణా పంపిణీ అదేవిధంగా నట్టల నివారణ నివారణ మరియు గొర్ల మేకలు నట్ట నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా 1962 అత్యవసరికి సంబంధించింది ఎర్రమడుగు విలేజ్లో ఆ వాహనాన్ని సందర్శించి డాక్టర్ల కు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి అభిలాష్. మరియు సిబ్బంది సందీప్, శ్రీనివాస రావు. గోపాలకృష్ణ, సాగర్, వెంకటేశ్వర రావు తదితరులు హాజరయ్యారు. గానుగపాడు గ్రామంలో డాక్టర్ శ్వేత ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు.

# లక్ష్యం మారటంతో ఒక్కటైన గ్రామం




**విస్సన్నపేట,జనవరి 29 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని కొండపర్వ గ్రామంలో దిక్కులేని వారికి దిక్కుగా అనాధలను ఆదరిస్తామని చెప్పిన మాటలకు ఆనాటి రెవిన్యూ శాఖ ఆదేశాలతో స్థలాన్ని ఇవ్వడం జరిగిందని గ్రామ సర్పంచ్ గొట్టిపూళ్ళ రమేష్ బాబు మీడియా సమావేశంలో తెలియజేశారు. అనాధ ఆశ్రమం నందు అనాధలు లేక బిల్డింగు అనాధగా మిగిలిపోయిందని ఆనాడు సేవే లక్ష్యంగా గ్రామస్తులతో పాటు లైన్స్ క్లబ్ అంటే సంస్థలు కూడా తమ వంతు సహాయం భవన నిర్మాణంలో చేయడం జరిగిందని తెలియజేశారు. ప్రస్తుతం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయటం పట్ల ఆయన అవాక్కయ్యారు. నిలువ నీడ లేని వారికి తానే నీడై ఉంటామని నాడు నమ్మబలికి నేను నీళ్ల వదిలేయటం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో జిబివిఎల్ నరసింహారావు,టిడిపి మండల మాజీ అధ్యక్షులు మట్టా వేణుగోపాలరావు, అక్కిరెడ్డి ఉమామహేశ్వరరావు వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు కొత్తపల్లి మహేష్, సామాజిక కార్యకర్త బోట్ల శివ సత్యనారాయణ తదితరులు సంయుక్తంగా అధికారులకు ఫిర్యాదు చేయడం జరిగింది.

# ఘనంగా చంద్రాల జిల్లాపరిషత్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు





**మైలవరం (చంద్రాల),జనవరి 29 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని చంద్రాల జిల్లా పరిషత్ హైస్కూల్ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్య అతిధిగా విచ్చేసిన మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గంగాధరరావు మాట్లాడుతూ ఎందరో నాయకుల అవిరామ కృషివలన చంద్రాల జిల్లా పరిషత్ హై స్కూల్ మంజూరు చేయబడిందని తెలిపారు. ఎంతోమంది విద్యార్థులు విద్యాభ్యాసం గావించి మంచి ఉద్యోగాలలో స్థిరపడ్డారని గుర్తు చేశారు. విద్యార్థులందరూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై మెరుగైన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతుల అంద జేశారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయు లు, జూలూరు చంద్రశేఖరరావు విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.



కొండపల్లి మున్సిపల్ చైర్మన్ మరియు ఎన్.టీ.ఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ జనరల్ సెక్రటరీ చెన్నుబోయిన చిట్టిబాబు యాదవ్ ను కలిసి అభినందనలు తెలుపుతున్న అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర కోశాధికారి యర్రాకుల శ్రీనివాస్ యాదవ్, ప్రముఖ పారిశ్రామిక వేత్త శ్రీ మందల సూర్యనారాయణ యాదవ్ -విజయవాడ,జనవరి 29 (వార్తాప్రభ) :

# కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నామినేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే కశిరెడ్డి



**హైదరాబాద్ /వార్తప్రభ(జనవరి 29):** కల్వకుర్తి పట్టణంలో రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో చైర్మన్ అభ్యర్థి బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ను కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నుకున్నారు .నామినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు బాలాజిసింగ్ గారు, భూపతి రెడ్డి గారు, వర్కాల భాస్కర్ రెడ్డి కలిసి నామినేషన్ ప్రక్రియలో పాల్గొని అభ్యర్థికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కల్వకుర్తి మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పకుండా గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.కల్వకుర్తి పట్టణాన్ని అభివృద్ధి పథంలో నిలిపామని, నియోజకవర్గ పరిధిలో అన్ని సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు అందుతున్నాయని అన్నారు.

# సికింద్రాబాద్‌లో ఘనంగా సంసాద్ ఖేల్ మహోత్సవ క్రికెట్ పోటీలు.

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న లైన్స్ క్లబ్ కొత్తపేట అధ్యక్షుడు డాక్టర్ విజయ రంగ.**



**ఎల్బీనగర్/వార్త ప్రభ (జనవరి 29)**:సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలో ప్రధానమంత్రి సంసాద్ ఖేల్ మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ పుష్పక్ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ మ్యాచ్‌లను సికింద్రాబాద్ ఎంపీ, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. లయన్స్ క్లబ్ జిల్లా సెక్రటరీ డాక్టర్ బి. విజయ్ రంగ ముఖ్య అతిథిగా హాజరై విజేతలు, రన్నర్‌అప్ జట్లకు బహుమతులు అందజేశారు. యువత క్రీడల్లో పాల్గొనడం ఆరోగ్యానికి మేలు చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

# అభివృద్ధి పనులు వేగంగా నాణ్యతతో పూర్తి చేయండి.

**కాంట్రాక్టర్లకు, అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం**




**శేరిలింగంపల్లి,జనవరి 29 (వార్తాప్రభ)**::మియాపూర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.4 కోట్ల 72 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం,మక్తా మహబూబ్‌పేట్ గ్రామంలోని పెద్దకుడి చెరువు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం,శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యమని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు.పనులు నాణ్యతతో,వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు ,కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యారంగంలో ఉమా దేవి సేవలు ప్రశంసనీయం.

**కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ యాదవ్**



**శేరిలింగంపల్లి,జనవరి29 (వార్తాప్రభ)**:కొండాపూర్ జెడ్ పి హెచ్ ఎస్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి ఉద్యోగ విరమణ సందర్భంగా అభినందన సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని,ఉమాదేవి ని సన్మానించారు.విద్యా రంగంలో ఆమె అందించిన సేవలు ప్రశంసనీయమని పేర్కొంటూ,అనేక మంది విద్యార్థుల భవితకు మార్గదర్శకంగా నిలిచారని అన్నారు.ఉద్యోగ విరమణ అనంతరం కూడా సమాజ హితానికి సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్ఎస్టీ చెక్ పోస్ట్ తనిఖీ

**వేములవాడ, జనవరి - 29:**(వార్తాప్రభ)మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడ పరిధిలోని సంకేపల్లి వద్ద ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ ను జిల్లా మున్సిపల్ ఎన్నికల వ్యయ పరిశీలకులు రాజ్ కుమార్ గురువారం తనిఖీ చేశారు.

# సజావుగా నామినేషన్ల ప్రక్రియ!!

● 8 కేంద్రాల్లో కొనసాగుతున్న నామినేషన్స్ ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీప





**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 29 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు సజావుగా సాగుతున్నాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పరిశీలించి నిర్ధారించారు. గురువారం ముబారక్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సప్తగిరి కాలనీ డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను, అదనపు కలెక్టర్ అరుణశ్రీతో సహా తనిఖీలు చేశారు. 60 డివిజన్లకు రామగుండంలో నామినేషన్ల స్వీకరణ సజావుగా జరుగుతోందని కలెక్టర్ చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో 8 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. జనవరి 30 వరకు దాఖలు, 31న పరిశీలన తర్వాత జాబితా ప్రకటన, ఫిబ్రవరి 1 సాయంత్రం 5 గంటల వరకు అప్పీల్స్, 2న నిర్ణయాలు, 3 మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహారణలు, సాయంత్రం అధికారిక అభ్యర్థుల పట్టిక ప్రకటన జరుగుతాయని వివరించారు. సంబంధిత అధికారులు కలెక్టర్ తో పర్యటించారు.

# భక్తుల సేవలో రామగుండం రిక్రియేషన్ క్లబ్!!

● గోదావరి తీరాన వైభవంగా పులిహోర వితరణ ● మానవత్వమే పరమార్థమన్న క్లబ్ సభ్యులు
● పంపిణీలో పాల్గొన్న ప్రముఖ పాత్రికేయులు జీవన్ బాబు



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 29 (వార్తాప్రభ ప్రతినిధి)**భక్తుల సేవలో రామగుండం రిక్రియేషన్ క్లబ్ తరిస్తున్నది. గోదావరి తీరాన వెలసిన రెండవ మేడారం సమ్మక్క సారలమ్మ జాతరలో వైభవంగా పులి ర వితరణ చేస్తూ ఆధ్యాత్మిక శోభకు ఆకర్షణగా నిలుస్తున్నారు. క్లబ్ అధ్యక్షులు బల్మూరి అమరేందర్ రావు ఆలోచనతో జాతర రెండవ రోజున భక్తుల సౌకర్యార్థం ఉచిత పులి ర పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సింగరేణి కాంట్రాక్టర్ కొల్లూరి శ్రీనివాస్ ఈ వితరణ కార్యక్రమానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించడంతో పాటు ప్రత్యక్షంగా పాల్గొని భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి తూముల అశోక్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అలాగే ప్రముఖ పాత్రికేయులు నిట్టూరి జీవన్ బాబు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. వీరితో పాటు ఈద జగన్మోహన్ రెడ్డి, ఏలేశ్వరం చంద్రమోళి, కొమురవెల్లి సుధాకర్, తూముల సంతోష్ రావు, రెడ్డి రవీందర్ రెడ్డి, సింగరేణి శ్రీనివాస్ తదితరులు పాల్గొని భక్తులకు సేవలు అందించారు. జాతరకు పోటెత్తిన భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రామగుండం రిక్రియేషన్ క్లబ్ చేస్తున్న ఈ కృషిని స్థానికులు, భక్తులు, సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ సభ్యులు ప్రశంసిస్తున్నారు.

# వినోద రావును అభినందించిన శ్రీ సాయి కృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

**శేరిలింగంపల్లి,జనవరి 29 (వార్తాప్రభ)**:ఓసి జేఏసీ-ఈడబ్ల్యూసి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా,శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా బోయినపల్లి వినోద్ రావు నియమితులైన సందర్భంగా గురువారం మదీనాగూడలోని ఆయన నివాసంలో శ్రీ సాయి కృప వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి,పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీ సాయి కృప వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నాగేశ్వరరావు,సురేష్ బాబు,రవిచందర్, బలవంత రెడ్డి,సంజీవ రావు,అజయ్,కృష్ణారెడ్డి, కాంతారావు ,రాము,సత్య నారాయణ,కాంతి రాజు, లక్ష్మీనారాయణ ,సాదిక్,బినయ్ కొల్లి, మురళీకృష్ణ,రమేష్ దండే తదితరులు పాల్గొన్నారు.



# తాగునీటి ఎద్దడి కలగకుండా చర్యలు చేపట్టాలి

● హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి ఎండీకి కొలన్ హన్మంత్ రెడ్డి వినతి ● వేసవి దృష్ట్యా వాటర్ లైన్ పనులు వేగవంతం చేయాలని కోరారు ● సానుకూలంగా స్పందించిన ఎండీ అశోక్ రెడ్డి






**కుత్బుల్లాపూర్, జనవరి 29, (వార్తాప్రభ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో నెలకొన్న తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి జలమండలి ఎండీ అశోక్ రెడ్డి ని కలిసి వినతిపత్రం అందజేశారు. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

**సమస్యల త్వరితగతిన పరిష్కారానికి విజ్ఞప్తి** నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న వాటర్ లైన్ పనులు మరియు ఔట్లెట్‌లకు సంబంధించిన సాంకేతిక సమస్యలను వెంటనే పూర్తి చేయాలని హన్మంత్ రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఎండీ సానుకూలంగా స్పందిస్తూ, క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్, సిద్దనోల సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, పద్మారావు, మనోజ్ రెడ్డి, శరత్ చంద్ర, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

**- శాసనసభ్యులు గాంధీ**



**శేరిలింగంపల్లి,జనవరి 29 (వార్తాప్రభ)**:చందానగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో రూ.6.58 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణం,రోడ్డు విభాగిని తదితర అభివృద్ధి పనులకు పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో,మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు.సీసీ రోడ్ల నిర్మాణాన్ని నాణ్యత ప్రమాణాలతో చేపట్టి,పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు,కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రజా కోర్టులో కాంగ్రెస్ కు శిక్ష తప్పదు

***టీఆర్ఎస్ నేత చిర్రా రవీందర్ యాదవ్***




**శేరిలింగంపల్లి,జనవరి 29 (వార్తాప్రభ)**:కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షతో వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత చిర్రా రవీందర్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు.మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇవ్వడం డైవర్షన్ రాజకీయాల్లో భాగమేనని అన్నారు.సీఎం రేవంత్ రెడ్డి చిల్లర రాజకీయాలు మానుకుని ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు.తమ వైఫల్యాలను దాచిపెట్టేందుకే బీఆర్ఎస్ నాయకత్వాన్ని వేధిస్తున్నారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు,హామీల అమలులో వైఫల్యాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు.ఎన్ని నోటీసులు,కేసులు పెట్టినా బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.తెలంగాణ సాధనతో పాటు పలు సంక్షేమ పథకాల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన విజనరీ నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వ రాజకీయాలను గమనిస్తున్నారని, ప్రజా కోర్టులో శిక్ష తప్పదని హెచ్చరించారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

# శివస్వాముల మహాపడిపూజకు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హాజరు



**ఎల్బీనగర్/వార్తాప్రభ(జనవరి 29):**హస్తినపురం డివిజన్ పరిధిలోని దేవినగర్‌లో శివస్వాముల మహాపడిపూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు హాజరై పన్నెండు మెట్ల పూజ నిర్వహించి భజనల్లో పాల్గొన్నారు. అనంతరం పన్నెండు మెట్లపై పన్నెండు కర్పూరాలు పెట్టి పడికాల్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన శివస్వాములు పడిపూజలో పాల్గొని శివనామస్మరణ జపం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ భాజపా అధ్యక్షులు ఆందోజు సత్యంచారి, అనిత, గోపి మధు తదితరులు పాల్గొన్నారు.

# హయత్ నగర్‌లో కుంగిన డ్రైనేజ్ ట్రంక్ లైన్.

**తక్షణ చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ డిమాండ్.**



**ఎల్బీనగర్/వార్తప్రభ (జనవరి 29)**:హయత్ నగర్ పాత గ్రామంలోని నేతాజీ యువజన సంఘం వద్ద భూగర్భ డ్రైనేజ్ ట్రంక్ లైన్ (1200 మి.మీ) కుంగిపోవడంతో రోడ్డు దెబ్బతిన్న ఘటనపై స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి , జలమండలి అధికారులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పాత ట్రంక్ లైన్ల కారణంగా తరచూ సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ, శాశ్వత పరిష్కారంగా కొత్త భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, ఇందుకు తక్షణమే నిధులు మంజూరు చేసి చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను కోరారు.

# హయత్ నగర్‌లో నూతన డ్రైనేజ్ ట్రంక్ లైన్‌కు నిధులు మంజూరు చేయండి

**జలమండలి ఎండీని కలిసిన కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి.**



**ఎల్బీనగర్/వార్తప్రభ(జనవరి 29):**హయత్ నగర్ డివిజన్ పరిధిలో ఫాతిమా నగర్ నుండి రాఘవేంద్ర టల్ వరకు నూతన భూగర్భ డ్రైనేజ్ ట్రంక్ లైన్ పైప్‌లైన్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డి ని కలిశారు. పాత డ్రైనేజ్ వ్యవస్థ కారణంగా రోడ్లు కుంగిపోతూ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు.సమస్య తీవ్రతను గుర్తించిన జలమండలి ఎండీ గారు ప్రతిపాదనలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

# క్రీడలు మానసిక, ఆరోగ్యానికి పెంపొందిస్తాయి

**కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**





**శేరిలింగంపల్లి,జనవరి 29 (వార్తాప్రభ)**:శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లిలో ఉన్న మంజీర డైమండ్ హైట్స్ గేటెడ్ కమ్యూనిటీలో నిర్వహించిన "మంజీర ప్రీమియర్ లీగ్" క్రీడా పోటీలను గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.క్రీడలు శారీరక,మానసిక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని,యువతలో క్రమశిక్షణ,జట్టు భావం,నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని ఆయన తెలిపారు.ఇలాంటి క్రీడా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంచుతాయని పేర్కొన్నారు.క్రీడల ప్రోత్సాహార్థం ఆయన రూ.50 వేల నగదుతో పాటు రూ.50 వేల విలువైన క్రీడా సామగ్రిని అందజేశారు.ఈ పోటీల్లో సీనియర్ సిటిజన్స్ జట్లు పాల్గొనడం విశేషమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,కమ్యూనిటీ నాయకులు,మహిళలు,పిల్లలు, సీనియర్ సిటిజన్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎడిటోరియల్

## అజిత్ పవార్ ఎన్సీపీ సారధ్యం ఎవరికి ?

దాదాపుగా నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవం కలిగిన అజిత్ పవార్ ఉన్నట్టుండి తెర మరుగు అయ్యారు. ఇది అనూహ్య మరణం. అనుకోని విధంగా మృత్యువు కాటేసిన విషాదం. ఆయన వయసు ఆరున్నర పదులు. అయితే రాజకీయంగా ఆయన ఇంకా చాలా కాలం పని చేయాల్సిన వారుగా ఉన్నారు. దాంతో వారసత్వం సమస్య కానీ బాధ్యత అప్పగింత కానీ ఎపుడూ చర్చకు వచ్చి ఉండకపోవచ్చు. దాని కంటే ముందు చెపుకోవాలీ అంటే మూడేళ్ల ముందు తన బాబాయ్ శరద్ పవార్ నాయకత్వంలోని ఎన్సీపీలో ముఖ్య నేతగా అజిత్ పవార్ నంబర్ టూగా ఉండేవారు. ఎపుడైతే శరద్ ఎన్సీపీని చీల్చి అజిత్ ఎన్సీపీగా మార్చారో దానిని పటిష్టం చేసుకుని తిరుగులేని ప్రాంతీయ పార్టీగా నేతగా ఎదిగారో నాటి నుంచే అజిత్ పవార్ పార్టీకి సర్వ సత్తాక నేతగా ఎదిగారు. అయితే అజిత్ పవార్ వెంట ఎంతో మంది ఎన్సీపీ నేతలు మొదటి నుంచి ఆ పార్టీకి అండగా ఉన్న వారు కలిసి వచ్చి భారీ చీలిక సాధ్యపడింది. వారి అండదండలు ఒక వైపు ఉండగానే అజిత్ పవార్ తన కుటుంబానికి కూడా ప్రాధాన్యత ఇచ్చారు అన్నది తెలుస్తోంది. ఆయన సతీమణి సునేత్రా పవార్ ని 2024 ఎన్నికలో బారామతి నుంచి లోక్ సభకు అజిత్ పవార్ పార్టీ తరఫున పోటీ చేయించారు. అయితే శరద్ పవార్ ఎన్సీపీ తరఫున శరద్ పవార్ కుమార్తె అజిత్ పవార్ చెల్లెలు సుప్రియా సూలే పోటీ చేసి బంపర్ విక్టరీని సాధించారు. ఆ ఎన్నికల్లో ఆమె సునేత్రా పవార్ ని ఓడించారు. అయితే సునేత్రా పవార్ రాజ్యసభ సభ్యురాలిగా ఉంటున్నారు. దాంతో ఆమె పట్ల అజిత్ పవార్ విశ్వాసం ఉంచారు అన్నది అర్థం అవుతోంది. ఇక ఆమె పార్టీ సారధ్యం వహించడం ద్వారా అజిత్ ఎన్సీపీని ముందుకు తీసుకుని వెళ్ళవచ్చు అని అంటున్నారు. భర్త అకాల మరణం ఆమెకు సానుభూతిగా కలసివచ్చే అవకాశం ఉంది అని అంటున్నారుయాక్షన్ కుమారుడు సైతం : ఇక అజిత్ పవార్ పెద్ద కుమారుడు పార్థుని కూడా రాజకీయాలోకి తీసుకుని వచ్చారు. 2019 ఎన్నికల్లో ఆయనను లోక్ సభకు పోటీ చేయించారు. అయితే ఓటమి పాలు అయిన పార్థు రాజకీయాల వైపు పెద్దగా ఆసక్తి చూపించలేదు. ఎపుడైతే తండ్రి అజిత్ పవార్ ఎన్సీపీని చీల్చి సొంత కుంపటి పెట్టుకున్నారో నాటి నుంచి పార్థు మళ్ళీ యాక్టివ్ అయ్యారు. దాంతో ఆయనకు పార్టీ సారథ్య బాధ్యతలు దక్కవచ్చు అన్న చర్చ కూడా ఉంది. అజిత్ పవార్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న బారామతి నుంచి ఉప ఎన్నికల్లో పోటీ చేసి పార్థు తన రాజకీయ ప్రయాణాన్ని కొత్తగా మొదలెట్టే చాన్స్ ఉందని అంటున్నారు. ఇక అజిత్ ఎన్సీపీకి అండగా ఎంతో మంది సీనియర్ నేతలు ఉన్నారు. వారిలో ప్రఫుల్ పటేల్ ముందు వరుసలో ఉన్నారు. ఆయనకు ఢిల్లీ స్థాయిలో సైతం మంచి పరిచయాలు ఉన్నాయి. పాలనానుభవం ఉంది. పార్టీని ఒడ్డున పడేసే ట్రబుల్ షూటర్ గా పేరు ఉంది. ఇక ఆయన తరువాత వినిపిస్తున్న రెండవ పేరు సునీల్ తట్కరే. ఈయనకు అజిత్ ఎన్సీపీ క్యాడర్ లో మంచి పేరు ఉంది. గ్రౌండ్ లెవెల్ లో పట్టున్న లీడర్ గా చెబుతారు. ఎన్సీపీ పార్టీని విజయవంతంగా ముందుకు తీసుకుని వెళ్తారు అని పేరు ఉంది. అలాగే సీనియర్ లీడర్ గా ఓబీసీ నేతగా ఛగన్ భుజబల్ పేరు కూడా బయటకు వస్తోంది. కానీ ఆయన ఏజ్ ఇపుడు ఇబ్బందిగా ఉంది. దాంతో ఆయన బాధ్యతలు తీసుకునే అవకాశాలు తక్కువ అని అంటున్నారు. పార్టీకి ఆయన గైడెన్స్ అయితే ఇస్తారు అని అంటున్నారు. ఇక అజిత్ పవార్ కి ఎంతో సాన్నిహిత్యం ఉన్న నాయకుడిగా ధనుంజయ్ ముండే పేరుని చెబుతారు. ఆయనకు పార్టీలో జనంలో యూత్ లో మంచి పేరు ఉంది. దాంతో ఆయనకు బాధ్యతలు అప్పగిస్తారు అన్న ప్రచారం కూడా ఉంది.అయితే అజిత్ పవార్ లేని చీలిక ఎన్సీపీని నడిపించడం బహు కష్టం అన్న భావన కూడా ఉంది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో తన బాబాయ్ తో కలసి అజిత్ పోటీ చేశారు. ఆయన బతికి ఉంటే తిరిగి ఎన్సీపీ అంతా ఒక్కటిగా ఉండేదన్న మాట ఉంది. ఇపుడు ఆయన లేకపోవడంతో సొంతంగా పార్టీని నడిపే కంటే శరద్ పవార్ సారధ్యంలోని ఎన్సీపీతో విలీనం చేస్తారు అన్న ప్రచారం కూడా ఉంది. తద్వారా కుటుంబం అంతా ఒక్కటి అవుతుందని మళ్ళీ ఎన్సీపీ బలంగా మహారాష్ట్ర రాజకీయాల్లో మారుతుంది అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

### శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి కళ్యాణం ఏర్పాట్లు ను పరిశీలించిన ఆర్.డి.వో.



**పెనుగంచిప్రోలు, జనవరి 29( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు గ్రామంలో ఫిబ్రవరి 1వ తేదీన జరగబోయే శ్రీ గోపయ్యస్వామి సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణం సందర్భంగా ఏర్పాట్లను రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, నందిగామ( ఆర్ డి వో )కె. బాలకృష్ణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కల్యాణ వేదిక ఏర్పాట్లు మరియు అమ్మవారి ఆలయంలో లడ్డు ప్రసాదం తయారీ ప్రక్రియను పరిశీలించి, పరిశుభ్రత మరియు నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శాంతి లక్ష్మి , ఆలయ ఏ ఈ రాజు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతన గొప్పది



దేవుని సన్నిధిలో
గడపాలి భక్తితో
స్థిరమైన మనసుతో
కొలవాలి శ్రద్ధతో
దైవ నామ స్మరణతో
శుద్ధి చేసుకోవాలి
సతతము సాధనతో
గమ్యాన్ని చేరాలి
సత్యమే పలుకుతూ
దైవాన్ని వెదుకుతూ
బ్రతుకు మార్చుకోవాలి
దర్శించుకోవాలి
దైనందిన బ్రతుకులో
దేవున్ని వేడాలి
అంతులేని ప్రేమలో
ఈ జన్మ తరించాలి

**-గద్వాల సోమన్న,**
గణితోపాధ్యాయుడు,
ఎమ్మిగనూరు,సెల్:99664145
80

# విద్యార్థుల భద్రతపై కైకలూరు టౌన్ పోలీసుల ప్రత్యేక నిఘా

### పాఠశాల-కళాశాల బస్సులపై విస్తృత తనిఖీలు.



**కైకలూరు జనవరి 29 (వార్తా ప్రభ)** పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల ప్రయాణం సురక్షితంగా ఉండాలనే ఉద్దేశంతో కైకలూరు టౌన్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విద్యా సంస్థల బస్సులపై విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీఎస్పీ డి. శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో కైకలూరు టౌన్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై వెంకట కుమార్ మరియు పోలీసు సిబ్బంది ఈ తనిఖీ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన బస్సులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాల ఫిట్‌నెస్, బ్రేక్‌ల స్థితి, టైర్ల పరిస్థితి, అలాగే అత్యవసర ద్వారాల (ఎమర్జెన్సీ ఎగ్జిట్) పనితీరును పరిశీలించారు.తనిఖీల సమయంలో ఎస్సై వెంకట కుమార్ వాహన చోదకులు, యాజమాన్యాలకు కీలక సూచనలు చేశారు. వందలాది మంది విద్యార్థుల ప్రాణాలు డ్రైవర్ల చేతుల్లోనే ఉంటాయని గుర్తుంచుకుని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. బస్సుల కండిషన్ సరిగా లేకపోతే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అతి వేగం ప్రమాదకరమని, నిర్ణీత వేగ పరిమితిలోనే వాహనాలను నడపాలని హెచ్చరించారు.అలాగే డ్రైవర్లు తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన ఆర్సీ, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటి పత్రాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యా సంస్థలు రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ఏఐవైఎం రాష్ట్ర కోశాధికారిగా యర్రాకుల శ్రీనివాస్ యాదవ్

**విజయవాడ, జనవరి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి):** అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కోశాధికారి గా యర్రాకుల శ్రీనివాస్ యాదవ్ కి నియామక పత్రం రాష్ట్ర అధ్యక్షులు చింకా నారాయణ రావు యాదవ్ నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ యాదవ్ సంఘీయుల ఐక్యత, అభివృద్ధి ధ్యేయంగా అఖిల భారత యాదవ మహాసభ పనిచేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర కోశాధికారిగా నియమితులైన యర్రాకుల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ సంఘ ఐక్యతకు, అభివృద్ధికి పాటు పడతానని యాదవ యువత విద్యా ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి కృషి చేస్తానని, ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు నారాయణరావుకు, మిత్రులు,జనరల్ సెక్రెటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ లకు ధన్యవాదాలు తెలియజేస్తూ సంఘ నిర్మాణం యాదవ జాతి సేవలో తన వంతుగా న్యాయం చేస్తానని పేర్కొన్నారు



# పేదలకు ఇళ్ళు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది

- కొండప్రాంతాల్లో వుండేవారు ఒక్క మాటపై ఉండాలి
- అందరికీ నావంతు సహకారాన్ని అందిస్తా
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీ శ హామీ





**విజయవాడ పశ్చిమ జనవరి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరంలో పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 46 వ డివిజనుల్లో కొండప్రాంతాల్లో (లంబాడి పేట) నివాసితులు గురువారం ఉదయం జిల్లా కలెక్టర్ ని కలిశారు. ఎండాకాలం, వర్షా కాలం,చలి కాలం ఇలా ఏ కాలమైనా కొండప్రాంతాల్లో నివాసముండే వారి వ్యతలు దూరం చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి దృష్టి సారిస్తున్నారు. ఆ క్రమంగా పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయం కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ ఆధ్వర్యంలో కొంతమంది మహిళలు జాబితా తయారు చేసి వారంతా స్వచందంగా తమ ఇళ్ళను ఖాళీ చేయడానికి ముందుకు రాగా వారందరినీ శ్రీధర్ జిల్లా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. వారంతా కొండప్రాంతాల్లో ఇళ్ళు ఖాళీ చేస్తామని స్వయంగా కలెక్టర్ ముందే ప్రకటించారు.దాంతో కలెక్టర్ వారితో స్వయంగా మాట్లాడుతూ ఎవరెన్ని విధాలుగా చెప్పినా అందరూ ఒక్కమాటపై నిలబడితే మీ అందరి కష్టాలు తీరుతాయని తాను అండగా ఉంటానని కాకుంటే ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మీ వంతుగా కొంత నగదును చెల్లించడానికి సిద్దంగా ఉండాలని సూచించారు. దానికి 46 వ,డివిజన్ మహిళలు అంతా అంగీకారాన్ని తెలిపారు. ఇదే కార్యరూపం దాల్చితే పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కొండప్రాంతాల్లో వారికి దశ తురుగుతుందనడంలో అతిశయోక్తి కాదేమో. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాటి శ్రీధర్ తో పాటుగా బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పశ్చిమ లో సుజనా చౌదరి హయాంలో అభివృద్ధి శూన్యం

### పార్టీ ఫిరాయింపు నాయకులు మాటలే వేరు
### వైసిపి కార్పొరేటర్ల విమర్శలు

**విజయవాడ పశ్చిమ, జనవరి 29: (వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక శాసనసభ్యుడు సుజనా చౌదరి పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసారని వైఎస్సార్సీపీ కార్పొరేటర్లు శీరంశెట్టి పూర్ణచంద్ర రావు, యరడ్ల ఆంజనేయ రెడ్డి, పి చైతన్య రెడ్డి, ఎండి ఇర్ఫాన్ విమర్శించారు. భవానిపురం శివాలయం సెంటర్లో గురువారం సాయంత్రం వైసిపి కార్పొరేటర్ల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాకతో డివిజన్ అభివృద్ధి కోసం పార్టీ మారినట్లు పేర్కొంటున్న తమ పార్టీ కార్పొరేటర్లు నేడు వైఎస్ఆర్సిపి పై బురద జల్లడం సిగ్గుచేటని విమర్శించారు. రాజకీయ కక్షతోనే 44వ డివిజన్ రిజర్వాయర్ మరమ్మత్తుల పనులను స్టాండింగ్ కమిటీ వాయిదా వేసిందని పేర్కొనటాన్ని వారు తీవ్రంగా ఖండించారు.ఆలాగే పార్టీ ఫిరాయింపు నాయకుల మాటలే వేరని ఎద్దేవా చేశారు. స్టాండింగ్ కమిటీ ముందుకు వచ్చే ప్రతిపాదన ఏదైనా పూర్తి ఎస్టిమేషన్ తో రావాలని పార్టీ మారిన కార్పొరేటర్లకు తెలియదా అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రులు ఆఖరికి రాష్ట్ర ప్రభుత్వం కూడా వాళ్ళదేనని, అయినా అభివృద్ధి పనులు జరగకపోతే తప్పు తమదా అని ధ్వజమెత్తారు. స్థానిక శాసనసభ్యుడు సుజనా చౌదరి ఈ 19 నెలల కాలంలో పశ్చిమంలో ఏం అభివృద్ధి పనులు చేశారో తెలియజేయాలని ప్రశ్నించారు. పార్టీ మారితే అభివృద్ధి పనులు జరుగుతాయి అంటూ ప్రజలతో నమ్మబలికిన నాయకులకు తీరా పార్టీ మారాక డివిజన్లో ఏ అభివృద్ధి పనులు జరగకపోవడంతో వారి పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందన్నారు. తమ నాయకుడు వెల్లంపల్లి ఇంట్లో స్టాండింగ్ కమిటీ సమావేశాలు జరుగుతున్నాయని పార్టీ మారిన కార్పొరేటర్లు పేర్కొనటం సిగ్గుమాలిన పనిగా అభివర్ణించారు . తమ నాయకుడిని మోసగించి, మామకు వెన్నుపోటు పొడిచిన పార్టీలోకి మారిన వ్యక్తులే వెన్నుపోటు కార్పోరేటర్లుగా చరిత్రలో నిలిచారని ఎద్దేవ చేశారు. వైయస్సార్సీపి హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప, ఈ 19 నెలల్లో జరిగిన అభివృద్ధి చూపించే సత్తా పార్టీ మారిన కార్పొరేటర్ల కు ఉందా అని ప్రశ్నించారు. విఎంసి నిధులన్నీ అమరావతి రాజధాని నిర్మాణం కోసం దారి మళ్ళిస్తున్నా అటు ఎమ్మెల్యేని, అధికారులను నిలదీయలేని దుస్థితిలో కూటమి కార్పొరేటర్లు ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో వైసిపి కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి పాల్గొన్నారు.



# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

### దివ్యాంగుడికి ట్రై సైకిల్ పంపించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్





**రెడ్డిగూడెం,జనవరి29(వార్తాప్రభ ప్రతినిధి)** :ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా, సేవే రాజకీయమని చాటుతూ శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ మరోసారి తన మానవత్వాన్ని, బాధ్యతాయుత నాయకత్వాన్ని నిరూపించారు.రెడ్డిగూడెం గ్రామంలో సిమెంట్ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా, మల్లాది కార్తీక్ అనే దివ్యాంగుడు తన జీవనోపాధి, దైనందిన అవసరాల కోసం ట్రై సైకిల్ సహాయం కోరుతూ ఎమ్మెల్యే ని ఆశ్రయించాడు. దివ్యాంగుడి ఆవేదనను గమనించిన ఎమ్మెల్యే క్షణం ఆలస్యం చేయకుండా స్పందించి, "దివ్యాంగుడికి తప్పకుండా ట్రై సైకిల్ అందిస్తా" అంటూ హామీ ఇచ్చారు.హామీ మాటలకే పరిమితం కాకుండా, ఎమ్మెల్యే శ్రీ వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ప్రత్యక్ష ఆదేశాలతోనే 70,000 వేల రూపాయల బ్యాటరీ ట్రై సైకిల్‌ను పంపించి, రెడ్డిగూడెం మండల పార్టీ నాయకుల ద్వారా దివ్యాంగుడికి అందజేశారు. ఈ రోజు మల్లాది కార్తీక్ పుట్టినరోజు కూడా కావడం విశేషం సహాయం నేరుగా ఎమ్మెల్యే చొరవతో సాధ్యమవ్వడం గ్రామంలో విస్తృత చర్చనీయాంశంగా మారింది.సహాయం అందుకున్న మల్లాది కార్తీక్, తన జీవితానికి దిశానిర్దేశం చేసిన ఈ సాయానికి గాను ఎమ్మెల్యేకి, పార్టీ నాయకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సమస్యల పట్ల స్పందన, పేదలు-దివ్యాంగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ, మాటలకంటే పనిలో నిబద్ధ తఇవన్నీ కలగలిసిన నాయకత్వానికి ప్రతిరూపంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ నిలుస్తున్నారని ఈ సంఘటన మరోసారి రుజువు చేసింది. ఈ ఘటన రెడ్డిగూడెం గ్రామంతో పాటు నియోజకవర్గం అంతటా ప్రశంసలు పొందుతోంది.

## తె దే పా ఎన్టీఆర్ జిల్లా పార్లమెంటు కార్యదర్శిగా ముగడా భవాని నియామకం!





**విజయవాడ పశ్చిమ జనవరి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఇటీవల కాలంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ 25 పార్లమెంటు కమిటీలు నియామికం జరిగిన దాంట్లో ఎన్టీఆర్ జిల్లా పార్లమెంటు కమిటీలో విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాద్ చిన్ని ఆశీస్సులతో బిసి మహిళ యాదవ సామాజిక వర్గానికి చెందినటువ ంటి తనకు తెలుగుదేశం పార్టీ ఎన్టీఆర్ జిల్లా పార్లమెంట్ కార్యదర్శిగా నియమించడం జరిగిందని భవాని తెలియజేస్తూ గత 30 ఏళ్ల క్రితం నుండి తన భర్త నమ్మి భాను ప్రకాష్ యాదవ్ మాజీ పశ్చిమ నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు తెలుగుదేశం పార్టీలో కార్యకర్తగా మొదలై ఎన్నో బాధ్యతలు నిర్వహించినందువల్ల తను కూడా ఆయనతో కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగేదని ఆమె అన్నారు. దానిని గుర్తించి ఎంపీ మరియు మిగతా నియోజవర్గం పెద్ద నాయకులు తనకు ఈ బాధ్యత అప్పగించినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ ఏదైతే పార్టీ తనకు అప్పచెప్పిన పనిని నాయ కుల ఆదేశాలతో తన సాయి శక్తుల నిర్వహిస్తానని గురువారం ఒక ప్రకటన ద్వారా ఆమె తెలియజేశారు.

## యూరియ పుష్కలంగా ఉంది రైతులు ఆందోళన చెందవద్దు



**చేజెర్ల జనవరి 29 (వార్తా ప్రభ)** మండలంలోని నాగులవెల్లటూరు గ్రామంలో యూరియా పంపిణీ చేయడం జరిగింది.ఇప్పటికీ చేజెర్ల మండలంలో రబీ లో 10600 ఎకరాల వరకు వరి సాగు చేయడం జరిగిందని చేజెర్ల మండల వ్యవసాయ అధికారి హిమబిందు తెలిపారు . ఎకరాకు 3 బస్తాల చొప్పున 1431 మెట్రిక్ టన్నులు కు గాను ఇప్పటివరకు 1360 మెట్రిక్ టన్నులు రైతు సేవ కేంద్రాలకు తెప్పించి రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు .యూరియా కొరత ఎక్కడ కూడా లేదని పేర్కొన్నారు .అవసరం ఉన్న చోట రైతు సేవ కేంద్రాలకు తెప్పించడం జరుగుతుందని కనుక రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె ఈ సందర్భంగా తెలియజేసారు .

## కొండ ప్రాంత వాసులకు బాసటగా ఎమ్మెల్యే సుజనా చౌదరి..



**విజయవాడ పశ్చిమ జనవరి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి )** పశ్చిమ నియోజకవర్గంలో కొండప్రాంత నిర్వాసితులకు ప్రత్యామ్నాయ నివాసాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి జిల్లా కలెక్టర్ ను కోరారు. గత రెండు సంవత్సరాలుగా పశ్చిమ నియోజకవర్గంలోని మల్లిఖార్జునపేట, కొత్తపేట, లంబాడీ పేట, విద్యాధరపురం తదితర ప్రాంతాల్లో కొండలపై నివసించే వారి ఇళ్లు శిధిలావస్థకు చేరాయి, వర్షాకాలంలో 38, 44, 46, 52 డివిజన్ లకు సంబంధించిన కొండ ప్రాంత నివాసితుల ఇళ్లు వర్షాలకు కూలిపోవడం, కొండ చరియలు పడటం వల్ల కొంత మంది నిర్వాసితులయ్యారు.. వాళ్ళకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల కోసం శాసనసభ్యులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తే కొండపై ఇళ్లు ఖాళీ చేసి వచేస్తామని ఎమ్మెల్యే కు తెలిపారు.. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఈ మేరకు కలెక్టర్ తో మాట్లాడి వారికి ప్రత్యామ్నాయ నివాసాలు ఏర్పాటు చేయాలని కోరారు.. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయం కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్ ఈరోజు ఆయా డివిజన్లు చెందిన 36 మంది నిర్వాసితులను కలెక్టర్ వద్దకు తీసుకు వెళ్లారు.. నిర్వాసితుల సమస్యను శ్రీధర్ కలెక్టర్ ముందుంచారు. వారి సమస్యలను వివరించారు. కలెక్టర్ గారు రెండు వారాల్లోగా వారందరికీ ప్రభుత్వ పథకం ద్వారా ఇళ్లు కేటాయించే ఏర్పాట్లను చేస్తానని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు... సుజనా చౌదరి కి నిర్వాసితులు ధన్యవాదాలు తెలిపారు.. కార్యక్రమంలో కూటమి నాయకులు బేసిఈ కంటేశ్వరుడు, సుజనా మిత్ర లు దొడ్ల రాజా, సప్పా శ్రీనివాస్ ..నిర్వాసితుల పాల్గొన్నారు..

## పారిశుద్ధ పనులు తనిఖీ చేసిన కలెక్టర్



**ఇబ్రహీంపట్నం, జనవరి 29(వార్తా ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.పారిశుధ్యం, మంచినీటి సరఫరా ఇతర సమస్యలపై స్థానిక ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు.స్థానిక వార్డు కౌన్సిలర్ ధరణికోట విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వెంకటరత్నం కలెక్టర్ కు వివరించారు. ప్రజలకు మంచినీటి సరఫరా సజావుగా చేయాలని, ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు నిర్వహించాలని. కమిషనర్ కు సూచించారు కలెక్టర్.

# వైభవంగా ఇందుపల్లి శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవం

## పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే యార్లగడ్డ
## దేవుడి విషయంలో రాజకీయాలు వద్దు: ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**గన్నవరం జనవరి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దేవుడి పట్ల , ఆలయాల పట్ల రాజకీయాలు చేయటం హేయం అని ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గం ఉంగుటూరు మండలం ఇందుపల్లిలో వెలసిన విఘ్నేశ్వర, దత్తాత్రేయస్వామి సహిత శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ 25వ వార్షికోత్సవం వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొని బాబావారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఉత్సవంలాగా వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు. వంటలకు ప్రసిద్ధి చెందిన ఇందుపల్లి గ్రామానికి చెందిన వారు



దేశవిదేశాల నుంచి ఈ వేడుకల కోసం తరలిరావడం విశేషమన్నారు. ఈ సందర్భంగా తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీరును తప్పుపట్టారు. దేవుడు అందరి కంటే గొప్పవాడని, ఆలయాల విషయంలో రాజకీయాలు చేయడం తగదని సూచించారు. కల్తీ నెయ్యి వాడారని ఆధారాలతో సహా తెలిసినా, తప్పును ఒప్పుకోకుండా సమర్థించుకోవడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. వైసీపీ నాయకులు తిరుమలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటూ భక్తుల మనోభావాలను దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయవద్దని, భక్తి విశ్వాసాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు దాసరి వెంకట బలవర్ధనరావు, ఉంగుటూరు మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్ర, గ్రామ టిడిపి అధ్యక్షులు ఉయ్యూరు మురళి, ఏఎంసీ డైరెక్టర్ కొండేటి వెంకటేశ్వరరావు, రాష్ట్ర తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి, పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షులు మొవ్వ వెంకటేశ్వరరావు, పార్లమెంట్ టీడీపీ కమిటీ ట్రెజరర్ బెజవాడ నాగేశ్వరరావు, పిఏసిఎస్ చైర్ పర్సన్ చెరుకుమిల్లి వేణు, డీసీ చైర్మన్లు కొమ్మారెడ్డి రాజేష్, తుమ్మల జగదీష్, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు తుమ్మల లత, పోతినేని రామకృష్ణ, మండల ఐటీడీపీ అధ్యక్షులు పోతినేని బాపయ్య, దాసరి చంటి, కుమ్మరి వెంకటేశ్వరరావు, కొణిజేటి సాంబయ్య, మరడా పాపారావు, పొన్నగంటి బాలకృష్ణ, మేకల కోటేశ్వరరావు, మాయర రమేష్, దోనేపూడి భరత్, గరిమెళ్ళ వరప్రసాద్, అట్లూరి శ్రీనివాసరావు, మొవ్వ వేణుగోపాల్, కొల్లూరు చంద్రకాంత్ మరియు ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాల గ్రంథాలయం ఏర్పాటు



**ఇబ్రహీంపట్నం, జనవరి 29(వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని కాచవరం పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. మండల విద్యాశాఖ అధికారి సి.హెచ్. పుష్పలత గ్రంథాలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయాన్ని పరిశీలించి, విద్యార్థులను ఉద్దేశించి ఏర్పాటు చేసిన ఉపాధ్యాయులను అభినందించారు. చిన్న వయస్సులోనే పుస్తకాలతో స్నేహం చేస్తే విద్యార్థులలో జ్ఞానం, ఆలోచనా శక్తి, వ్యక్తిత్వ వికాసం మరింత మెరుగవుతుందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. గ్రంథాలయం విద్యార్థులకు రెండో తరగతి గదిలా ఉపయోగపడుతుందని, పుస్తకాల ద్వారా ప్రపంచ విజ్ఞానాన్ని తెలుసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూలపాడు సీఆర్పీ దొంతమాల నాగేశ్వరావు మాట్లాడుతూ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల కాచవరం కేవలం జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శవంతమైన పాఠశాలగా నిలుస్తుందని అన్నారు. గ్రంథాల ఏర్పాటుకు ఉర్దూ ఉపాధ్యాయుడు ఇర్ఫాన్ పాషా కృషి చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలి



**ఇబ్రహీంపట్నం, జనవరి 29(వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని ఈలప్రోలు గ్రామంలో డాక్టర్ నార్లతాతారావ్ విద్యుత్ కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరాన్ని గురువారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, జనసేన పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్కల రామ్మోహన్రావు (గాంధీ) ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను గ్రామాల్లోని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. వైద్య శిబిరాల్లో వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందుల అందజేస్తారని తెలిపారు ఎలక్ట్రోకార్డియోగ్రాఫ్ పరీక్షలు, ఇకోపరీక్షలు, మధుమేహవ్యాధి పరీక్షలు, శ్వాసకు సంబందించిన పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసారు. 223 మంది వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమములో గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షులు కడియాల వెంకటరావు, గ్రామ సర్పంచ్ కరణం రంగయ్య,సొసైటీ డైరెక్టర్ బోయినపల్లి సాంబయ్య బిజెపి పార్టీ నాయకులు కడియం అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



**చేజర్ల జనవరి 29 (వార్తాప్రభ)** మండలంలోని చీర్లవారికండ్రిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యాసామగ్రిని గ్రీన్ కో సోలార్ కంపెనీ వారు గురు వారం అందజేశారు. రిపబ్లిక్ డే సందర్భంగా విద్యార్థులకు అవసరమైన నోటుబుక్స్ డ్రాయింగ్ బుక్స్ పెన్ పెన్సిల్ షార్ప్నర్ ఏరేజర్ స్కేల్ క్రేయన్స్ లను అందజేస్తామని తెలిపారు. ప్రతి ఏటా పిల్లలకు అవసరమైన విద్యా సామగ్రిని అందజేస్తున్నామని ఇందులో భాగంగానే ఈ ఏడాది కూడా అందజేశామని గ్రీన్ కో సోలార్ కంపెనీ మేనేజర్ సుబ్రహ్మణ్యం తెలియజేసారు. అలాగే పాఠశాల తరపున కంపెనీ యాజమాన్యం మేనేజర్ సిబ్బందికి అలాగే పాఠశాల విద్యార్థులకు భోజన ప్లేట్లను పాడేరు సర్పంచ్ గుమ్మా వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా వారికి పాఠశాల ఉపాధ్యాయుడు పి.మల్లికార్జున రావు ధన్యవాదాలు తెలిపారు.

## లింగ గూడెం చేరుకున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి పల్లకీలు



**పెనుగంచిప్రోలు, జనవరి 29( వార్త ప్రభ )** రంగుల మ త్సవం ముగించుకొని ,జగ్గయ్యపేట, చిల్లకల్లు,భీమవరం మీదుగా పెనుగంచిప్రోలు మండలం లోని లింగగూడెం కి శ్రీ తిరుపతమ్మ అమ్మవారి పల్లకీలు చేరుకున్నారు. కాలినడక రజకులు అమ్మ వారి పల్లకీలు మోస్తూ బీమవరం నుండి డొంక దారిలో లింగగుడెం చేరు కున్నారు. గురు వారం రాత్రి లింగగుడెం గ్రామం లో గ్రామ స్తులు మొక్కులు తీర్చుకుంటా రు శుక్రవారం ఉదయం కి భోజనాలు ఏర్పాటు చేసుకుంటారు. అనంతరం ఊరేగింపుగా అమ్మ వారి పల్లకీలు పెనుగంచిప్రోలు లో ని వెంకటేశ్వర సినిమా హాల్ సెంటర్ లో అమ్మ వారి విశ్రాంతి మందిరం లో ఆలయ ప్రధాన అర్చకులు మర్రె బోయిన గోపి బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుంది అనంతరం అమ్మ వారి ఆలయం కు ఊరేగింపుగా మేళ్ల తాలాల్లు మంగళవాయిా ద్యాల మధ్య డప్పు వాయి ద్యాల తో ఆలయం కు అమ్మ వారు సహదేవతా మూర్తులు చేరుకుంటారు. ఈ కార్యక్రమంలో మాదినేని వెంకట్రా వ్. శివా, మురకుట్ల వెంకటేశ్వర్లు, బొర్రయ్య, పాములూరి వెంకటేశ్వరరావు, బరిగేలా వెంకటరామయ్య, వెంకయ్య. ఏనుగుల ధర్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# బందరు పోర్టుకు కొల్లిపర రమణ నాయుడు పేరు పెట్టాలని డిమాండ్.

**మచిలీపట్నం జనవరి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం మాజీ శాసనసభ్యునిగా మాజీ మున్సిపల్ చైర్మన్ గా జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నీతి నిజాయితీతో పదవులు నిర్వహించిన బహుదూర్ కొల్లిపర రమణయ్య నాయుడు పేరును బందరు పోర్టుకు పెట్టాలని పలువురు వక్తలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.. మచిలీపట్నం కొల్లిపర రమణయ్య నాయుడు సర్కిల్ లో గురువారం రమణయ్య నాయుడు 66వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పలు రాజకీయ పార్టీ నాయకులు సీనియర్ న్యాయవాదులు బార్ అసోసియేషన్ సభ్యులు రమణయ్య నాయుడు విగ్రహానికి ఘనంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు.. నీతి నిజాయితీతో పదవులు నిర్వహించి రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేకతను ఏర్పాటు చేసుకున్న కొల్లిపర రమణయ్య నాయుడు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శప్రాయుడని అన్నారు. న్యాయవాదిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా అనేకమంది పేదవారికి ఉచితంగా సహాయం అందించిన మహనీయుడు బహదూర్ రమణయ్య నాయుడు అని అన్నారు. కులమతాలకు అతీతంగా మచిలీపట్నం అభివృద్ధి కోసం ఆకుంఠిత దీక్షతో పదవులు నిర్వహించిన కొల్లిపర రమణయ్య నాయుడు పేరును బందరు పోర్ట్ కి పెట్టడం సముచితమని వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లిపర రమణయ్య నాయుడు మనవడు న్యాయవాది కొల్లిపర రమణమూర్తి, సాఫ్ట్వేర్ ఇంజనీర్ కొల్లిపర రవి, జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ భారతీయ జనతా పార్టీ



నియోజకవర్గ ఇన్చార్జ్ సోడిశెట్టి బాలాజీ రావు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గొర్రెపాటి గోపీచంద్ రాష్ట్ర బ్రాహ్మణ సంఘ. డైరెక్టర్ పివి ఫణి కుమార్ మచిలీపట్నం అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ కూనపరెడ్డి శ్రీనివాసరావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్రరావు జనసేన పార్టీ నగర అధ్యక్షులు గడ్డం రాజు కొంకేపూడి పిఏసిఎస్ అధ్యక్షులు లక్ష్మణరావు మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షులు దివిపోతురాజు న్యాయవాదులు అమరేశ్వరరావు నరేంద్ర రాజకీయ పార్టీ నాయకులు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు

# దళవాయి సుబ్బరాయయ్య స్కూల్ లో ఆకస్మిక తనిఖీలు

- హాజరు పట్టిక మౌలిక వసతులు పరిశీలన
- పశ్చిమ తాసిల్దార్ రిబ్కా రాణి
- మండల విద్యాశాఖ అధికారి సోమశేఖర్ నాయక్



**విజయవాడ పశ్చిమ, జనవరి 29.(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ తహసీల్దార్ రిబ్కా రాణి విజయవాడ పశ్చిమ మండల విద్యాశాఖ అధికారి -2 ..సోమ శేఖర్ నాయక్ సంయుక్తం గా దళవయి సుబ్బారామయ్యా మున్సిపాల్ స్కూల్ ను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. 10 వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా స్ఫూర్తిదాయకం



గా కొద్ది సేపు మాట్లాడారు. 10 వ తరగతి హాజరు పట్టీక పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా ప్రభుత్వ పాఠశాలల్లో 10 వ తరగతి విద్యార్థులకు చేపట్టిన 100 డేస్ యాక్షన్ ప్లాన్ అమలును నిశితంగా పరిశీలించారు. ప్రభుత్వం ఇచ్చిన 10 వ తరగతి అల్ ఇన్ వన్ స్ఫూర్తి మెటీరియల్ వివరాలు ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు ఆర్ ఐ సిరి వెన్నెల, వి ఆర్ ఓ ఆఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్తి భద్రత మధ్య ఏపీపీఎస్సీ పరీక్షలు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ
- మూడో రోజు 1108 మందికి 370 మంది అభ్యర్థుల హాజరు


**ఇబ్రహీంపట్నం, జనవరి 29 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. నగరంలో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఇబ్రహీంపట్నంలోని జాకీర్ హుస్సేన్ కళాశాల పరీ కేంద్రాలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 27 నుంచి 31 వరకు ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడో రోజు నాలుగు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయన్నారు. విజయవాడలోనే బిషప్ అజరయ్య జూనియర్ కళాశాల, చిట్టూరి విద్యాలయం, రామవరప్పాడు జడ్పీ హైస్కూల్, ఇబ్రహీంపట్నంలోని జాకీర్ హుస్సేన్ కళాశాలలో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మూడో రోజు పరీక్షలకు 1108 మంది హాజరు కావాల్సి ఉండగా 370 మంది అభ్యర్థులు హాజరయ్యారని, 738 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారని చెప్పారు. పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రెవెన్యూ, విద్యుత్, వైద్య



ఆరోగ్యం, రవాణా, పోలీస్ తదితర శాఖల పర్యవేక్షణలో పకడ్బందీ ఏర్పాట్లతో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీ కేంద్రాల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు సౌకర్యం ఏర్పాటు చేశామని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేస్తున్నారని చెప్పారు. అభ్యర్థుల ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

# ఘనంగా వేటూరి సాహితీ మహోత్సవం.

**మోపిదేవి: అవనిగడ్డ: జనవరి 29(వార్తాప్రభ ప్రతినిధి)**కవి కలాలంకరణ :: వేటూరి సుందర రామమూర్తి సాహితీ మ త్సవం, వేటూరి 90వ జయంతి వేడుకలు వేటూరి సాహిత్యాభిమాన సమితి ఆఫ్ అమెరికా సంస్థ ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. వేటూరి వారి స్వగ్రమమైన కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెదకళ్ళేపల్లి లో గురువారం సాహిత్యాభిమానుల హర్షాతిరేకాల మధ్య వేటూరి సాహితీ మహోత్సవం కన్నులపండువగా జరిగింది. సుప్రసిద్ధ సినీ పాటల రచయిత వేటూరి సుందరరామమూర్తి రచించిన సినీయేతర సాహిత్యానికి వారి స్వగ్రామం మోపిదేవి మండలం పెద్ద కళ్లేపల్లిలో పల్లకిలో ఊరేగించి శ్రీ దుర్గా నాగేశ్వర స్వామి సన్నిధిలో పూజలు జరిపించి ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఆరు సంపుటాలను అంకితమిచ్చారు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, అమెరికా వేటూరి సాహిత్య అభిమాన సమితి అధ్యక్షులు ప్రసాద్ తోటకూర తదితర ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత వేటూరి సుందర రామమూర్తి, సహా సాహితీవేత్తల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చల్లపల్లి ఎస్టేట్



దేవాలయాల సహాయ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు, అచ్యుత మధుసూదనరావు తదితరులు, కార్యక్రమాలను పర్యవేక్షించారు.

## బహువార్షిక పశుగ్రాసాల సాగుపథకాలను ఉపయోగించుకోండి




**చేజర్ల జనవరి 29 (వార్తా ప్రభ)** మండలం లోని పెరుమాళ్ళపాడు మరియు నూతక్కివారికండ్రిగ గ్రామాలనందు ఉచిత పశు ఆరోగ్య శిబిరములు కార్యక్రమం నిర్వహించబడినవి. పెరుమాళ్ళపాడు గ్రామమునందు సర్పంచ్ నూతక్కివారి కండ్రిగ నందు నాయకులు రాజాల ఆదినారాయణ రెడ్డిగారు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై పశువులకు, జీవాలకు మరియు మేకలకు నట్టల నివారణ మందులు అందజేశారు. కార్యక్రమంలో డా.పి.రాజేష్ మాట్లాడుతూ పశు బీమా మరియు బహువార్షిక పశుగ్రాసాల సాగు వంటి పథకాలను ఉపయోగించుకోవాల్సిందిగా తెలియజేశారు. కార్యక్రమంలో పాడిరైతులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు పాటను విశ్వవ్యాప్తం చేసిన వేటూరి




**మచిలీపట్నం జనవరి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** తెలుగు పాటను విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు వేటూరి సుందర రామమూర్తి అని డా.చింతలపాటి మురళీకృష్ణ అన్నారు. స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో గురువారం వేటూరి సుందర రామమూర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేటూరి ప్రతిభను కీర్తిస్తూ డా. చింతలపాటి మురళీకృష్ణ ఆలపించిన గేయం ఆకట్టుకుంది. పరిషత్ కార్యదర్శి ముదిగొండ శాస్త్ర మాట్లాడుతూ వేటూరి మన జిల్లావాసి కావడం మనకు గర్వకారణం అని అన్నారు. పాత్రికేయునిగా వేటూరి అందించిన సేవలను వివరించారు. పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాషకు ప్రాచీన దా కల్పించని కారణంగా జాతీయ పురస్కారాన్ని తిరస్కరించిన భాషాభిమాని వేటూరి అని అన్నారు. ఈ సందర్భంగా డా. చింతలపాటిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథాలయాధికారి బీరం వెంకటరమణ యుడిసి బి విజయకుమార్ ఎల్డిసి ఐవి రామారావు గ్రంథాలయ సిబ్బంది పాఠకులు పాల్గొన్నారు.

## పుష్పాలంకరణ వేడుకల్లో పాల్గొన్న బిఎస్ఆర్



**మండవల్లి జనవరి 29 (వార్తా ప్రభ)** ముసునూరి రంగారావు, శ్రీమతి కృష్ణవేణి ఆహ్వానం మేరకు వారి మనవరాలి పుష్పాలంకరణ వేడుకల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీడీపీ నాయకుడు బూరుబోయిన శ్రీనివాసరావు (బి ఎస్ ఆర్) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ, మాడపాటి వినోద్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వేడుకలు సుఖసంతోషాలతో జరగాలని ఆకాంక్షించారు.

## ఓం శాంతి ప్రీమియర్ షో




**మచిలీపట్నం జనవరి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం మినీ రేవతి థియేటర్ లో ఓం శాంతి సినిమా ప్రీమియర్ షో ను గురువారం థియేటర్లో ప్రదర్శించారు. సినిమా కథా నాయకుడుగా తరుణ్ భాస్కర్, కథానాయిక ఈషా రబ్బ నటించారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా రిలీజ్ కానున్న ఓం శాంతి మూవీ ప్రీమియర్ షో ను ఉచితంగా ప్రేక్షకులకు ప్రదర్శించారు. ఈ సినిమాకి గాను ప్రేక్షకుల దగ్గర నుండి టికెట్లకు డబ్బులు వసూలు చేయలేదు. కుటుంబ తరహా చిత్రం ను వీక్షించి ప్రేక్షకులు ఆనందించారు. హీరో తరుణ్ భాస్కర్ గతంలో ఈ నగరానికి ఏమైంది, క్రీడా కోడ పలు చిత్రాలలో నటించారు. ఇషా రబ్బ గతంలో రాజు గారి గది 2, అరవింద సమేత పలు చిత్రాలలో నటించింది.

## శిల్పారామం లో ఆకట్టుకున్న గాంధీ శిల్ప బజార్ హస్తకళా మేళ





**శేరిలింగంపల్లి,జనవరి 29 (వార్తాప్రభ)**:మాదాపూర్‌లోని శిల్పారామంలో చత్తీస్‌గఢ్ హస్తశిల్ప వికాస్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాంధీ శిల్ప బజార్ హస్తకళా మేళా సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.ఈ మేళాలో గోండ్ పెయింటింగ్, మూరల్ పెయింటింగ్,మధుబని పెయింటింగ్‌లతో పాటు కోస సిల్క్ చీరలు,బస్తర్ మెటల్ క్రాఫ్ట్స్, బీదరి క్రాఫ్ట్స్, బీడ్స్ క్రాఫ్ట్స్,జనపనారతో తయారు చేసిన బొమ్మలు,జ్యూట్ ఉత్పత్తులు తదితర అనేక రకాల హస్తకళా వస్తువులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్క ృతిక కార్యక్రమాలు సందర్శకులను మంత్రముగ్ధులను చేశాయి.అనూష సూర్యస్ శిష్య బృందం ప్రదర్శించిన సంగీత విభావరి మరియు కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో అలరించింది.సంగీత విభావరిలో శ్రీ గణనాథం, జయ జయ శుభకర,శక్తి సహిత,మాధవ కేశవ,గోవిందా వంటి కీర్తనలను ఆలపించి కళాకారులు శ్రోతలను ఆకట్టుకున్నారు.అలాగే కూచిపూడి నృత్య ప్రదర్శనలో మూషిక వాహనమ్, తరంగం,భజమానస,అన్నమాచార్య కీర్తన,తరంగం వంటి అంశాలను కళాకారులు దుర్గ,దివి,అన్య,ప్రణయ,ఇషా, రుషిక,రిత్విక,అధ్య,శంభావి, అదితి తదితరులు సొగసుగా ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.

## పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయండి

**- సబ్ కలెక్టర్ కావూరి చైతన్య**

**మైలవరం పట్టణంలో పర్యటించిన సబ్ కలెక్టర్**



**మైలవరం:జనవరి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇప్పటినుంచే విద్యార్థులను సిద్ధం చేయాలని విజయవాడ సబ్ కలెక్టర్ కావూరి చైతన్య విద్యాశాఖ అధికారులకు సూచించారు. మైలవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో మైలవరం మండలంలో జరిగే అభివృద్ధి పనులపై గురువారం వివిధ శాఖల అధికారుల తో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 100 రోజుల పణాళికలో భాగంగా 55 రోజుల ప్రణాళికపై విద్యాశాఖ అధికారులతో చర్చించారు.ప్రత్యేక తరగతులతోపాటు విద్యార్థు లకు ప్రతిరోజు పరీక్షలు నిర్వహించాలని సూచిం చారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024-25 అలాగే 2025-26 లో మైలవరం మండలంలో(1.0 మరియు 2.0 కింద) జరిగిన సిసి రోడ్డు పనుల, తదితర వాటి ప్రోగ్రెస్ పై అధికారులతో చర్చించారు.హౌసింగ్ స్కీం ద్వారా బిఎల్, ఆర్ఎల్, పెండింగ్ లో ఉన్న ఇల్లు నిర్మాణాలు గురించి ఆరా తీశారు. ఉగాది నాటికి 1010 పూర్తయ్యేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు.మండలంలో ఈ క్రాప్ బుకింగ్, యూరియా లభ్యత,అధిక ధరలు గురించి మండల వ్యవసాయ అధికారులతో చర్చించారు.అనంతరం అధికారులతో కలిసి మైలవరం పట్టణంలోని జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి పదోతరగతి,ప్లస్ టు విద్యార్థులతో మాట్లాడారు.పబ్లిక్ పరీక్షలకు బాగా చదవాలని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.అనురాధ, తహశీల్దార్ అబ్దుల్ దరియ,ఎం ఈ వొ, డిప్యూటీ ఎంపీడీవో, పంచాయతీరాజ్ ఏఈ రమణమ్మ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నవీన్ కుమార్, మైలవరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.శ్రీనివాసరావు, జి ఎస్ డబ్ల్యూ ఎస్ అధికారి,మైలవరం గ్రామపంచాయతీ ఈవొ రఫీ, గ్రామ రెవెన్యూ అధికారులు,గ్రామ సచివాలయం సిబ్బంది, ఉపాధి హామీ పథకం ఏపీఓ తదితరు లు పాల్గొన్నారు.

## బంటుమిల్లి ప్రధాన కాలువకు నీరు విడుదల చేయాలని ఎస్.ఈ. ని కలిసిన డి సి చైర్మన్లు...



**కృత్తివెన్ను,జనవరి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** బంటుమిల్లి ప్రధాన కాలువకు నీరు విడుదల విడుదల చేసి రైతులను ఆదుకోవాలని, పెడన నియో జకవర్గ శాసన సభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశానుసారం నియోజకవర్గనికి చెందిన నాలుగు మండలాల డీసీ చైర్మన్లు గురువారం విజయవాడలోని కృష్ణాజిల్లా నీటిపారుదల రైతు భవనంలో నీటిపారుదల శాఖ ఎస్ ఈ మోహనరావుకు వినతిపత్రం అందజేయడం జరిగింది. నియోజవర్గంలో రెండో పంటగా మినుము పంటను వేయడం జరిగిందని ఈ సమయంలో పైరుకు నీరు పెడితే మంచి దిగుబడి లభిస్తుందని డీసీ చైర్మన్లు ఎస్ ఈ కు తెలియజేశారు. నీటిపారుదల శాఖ అధికారిని కలిసిన వారిలో గూడూరు కమలాపురం బంటుమిల్లి కృత్తివెన్ను డీసీ చైర్మన్ లు పోతన స్వామి నాయుడు నెక్కంటి భాస్కరరావు, బొర్రా కాశి నల్లమోతు రఘురామ్ బొర్రా ఏడుకొండలు తదితరులు ఉన్నారు...

# బాక్సింగ్ రింగులో లింగాపూర్ పంచులు!!

- శ్రావ్యాంజలికి రాష్ట్ర స్థాయి గోల్డ్ మెడల్
- పెద్దపల్లి జిల్లా గర్వించేలా చేసిన స్వర్ణ పతక విజేత
- తెలంగాణ బాక్సింగ్ ఛాంపియన్‌గా మోడల్ స్కూల్
- విన్నర్‌ను అభినందించిన ప్రిన్సిపల్ పి.సదానందం






**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 29 (వార్తాప్రభ ప్రతినిధి)** తెలంగాణ రాష్ట్ర పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో హైదరాబాద్ వేదికగా నిర్వహించిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (2025-26) రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో రామగుండం మండలం లింగాపూర్ లోని తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని సిగిరి శ్రావ్యాంజలి అద్భుత ప్రదర్శన కనబర్చి గోల్డ్ మెడల్ కైవసం చేసుకుంది. తన అసాధారణ ప్రతిభతో ప్రత్యర్థులను చిత్తు చేసి స్వర్ణ పతకాన్ని సాధించిన శ్రావ్యాంజలి, పాఠశాల కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటి చెప్పడంతో పాటు పెద్దపల్లి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. ఈ ఘన విజయం పట్ల పాఠశాల ప్రిన్సిపల్ పి.సదానందం అలాగే ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థినిని ఘనంగా అభినందించారు. శ్రావ్యాంజలి క్రమశిక్షణ, పట్టుదల వల్లే ఈ విజయం సాధ్యమైందని, రాబోయే రోజుల్లో తను జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. క్రీడల్లో రాణిస్తూనే చదువులో కూడా ముందుండాలని హితవు పలుకుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు శ్రావ్యాంజలి ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని ప్రిన్సిపల్ ఈ సందర్భంగా కొనియాడారు.

# న్యాయం కోసం ఎమ్మెల్యే ముంగిట కార్మిక బిడ్డలు!!

- సింగరేణి కార్మికుల పక్షపాతి కాంగ్రెస్
- మారుపేర్ల సమస్యపై సర్కారు సానుకూలం
- కార్మిక బిడ్డల దశాబ్దాల కష్టాలకు మోక్షం కలిగిస్తాం
- హామీ ఇచ్చిన ఎమ్మెల్యే మక్కాన్ సింగ్



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 29 (వార్తాప్రభ ప్రతినిధి)** దశాబ్దాలుగా అపరిష్క ృతంగా ఉన్న మారుపేర్ల సమస్యను అలాగే న్యాయం కోసం ఎమ్మెల్యే ముంగిట కార్మిక బిడ్డలు తమ గోడు వినిపించారు. సమస్యను విన్న ఎమ్మెల్యే వారితో ఈ అంశంపై హామీ ఇచ్చారు. ఈ విషయంలో ప్రభుత్వం ఇప్పటికే సానుకూలంగా ఉందని, త్వరలోనే సమస్య కొలిక్కి వస్తుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అర్హులైన వారందరికీ త్వరలోనే ఉద్యోగ పత్రాలు ఇప్పించేలా కృషి చేస్తానని భరోసా కల్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, మున్సిపల్ ఎన్నికల అనంతరం మారుపేర్ల బాధితులకు ఖచ్చితంగా న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లక్క శ్రావణ్, జగ్గు శ్రావణ్, డిష్ బాబు, రామిల్ల సందీప్, ఇంజంపల్లి ఓం ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పబ్లిక్ ఫైటర్ సంజీవ్ సక్సెస్!!

- అధికారుల మొండి వైఖరికి బ్రేక్
- అభ్యర్థి ఒక్కరు చెల్లిస్తే చాలు
- నో డ్యూ సర్టిఫికేట్ ఫీజు వివాదానికి తెర



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 29 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం నగరపాలక సంస్థలో నెలకొన్న ‘నో డ్యూ సర్టిఫికెట్‘ ఫీజు వివాదంపై పబ్లిక్ ఫైటర్ కొండపర్తి సంజీవ్ చేపట్టిన పోరాటం ఎట్టకేలకు ఫలించింది. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కార్పొరేషన్ పరిధిలో నో డ్యూ సర్టిఫికెట్ కోసం అభ్యర్థులతో పాటు వారి హామీదారు పేరిట 6వేల రూపాయలు ఫీజులు వసూలు చేసే విధానంపై సంజీవ్ అధికారులను నిలదీస్తూ ఫిర్యాదు చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అధికారులు, అభ్యర్థి ఒక్కరు మాత్రమే 3000 రూపాయల ఫీజు చెల్లిస్తే సరిపోతుందని స్పష్టం చేస్తూ తమ నిర్ణయాన్ని మార్చుకున్నారు. ఈ నిర్ణయంతో సామాన్య అభ్యర్థులపై పడుతున్న అదనపు ఆర్థిక భారం తప్పిందని, ఇది ప్రజల పన నిలబడి చేసిన పోరాటానికి దక్కిన గొప్ప విజయమని స్థానికులు కొనియాడుతున్నారు. అధికారుల మొండివైఖరిని ఎండగట్టి, నిబంధనలను సడలించేలా చేసిన బీజేపీ నాయకులు కొండపర్తి సంజీవ్ కృషి పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. నగరపాలక సంస్థ దిగిరావడంతో అభ్యర్థులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

# గొల్లపూడి హోల్ సేల్ మార్కెట్లో ఆర్కా సోలార్ పవర్ కార్యాలయం ప్రారంభం







**విజయవాడ పశ్చిమ, జనవరి 29: (వార్తా ప్రభ ప్రతినిధి)** గొల్లపూడిలోని మహాత్మా గాంధీ హోల్ సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ లో 85వ నెంబర్ షాపులో ఆర్కా సోలార్ పవర్ కార్యాలయంను గురువారం సాయంత్రం ఆర్యవైశ్య కార్పోరేషన్ చైర్మన్ డూండీ రాకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా డూండీ రాకేష్ మాట్లాడుతూ సోలార్ పవర్ ని ప్రతి ఇంటి వారు వినియోగించుకోవడం అవసరమని అన్నారు. సబ్సిడీ ద్వారా సోలార్ పవర్ లభిస్తుందని, ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్కా సోలార్ పవర్ సిఎండి గోపు కిరణ్ కుమార్ మాట్లాడుతూ తాము టాటా పవర్ సోలార్ రూఫ్ ఛానల్ పార్ట్నర్ గా సేవలందిస్తున్నామని చెప్పారు. సోలార్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు ఇస్తున్నాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటింటికి సోలార్ విద్యుత్తు ఉండాలని చూస్తున్నారని చెప్పారు. సోలార్ విద్యుత్ పర్యావరణానికి ఉపయోగమని చెప్పారు. పి యం సూర్య ఘర్ యోజన పథకం ద్వారాసోలార్ విద్యుత్తును ఏర్పాటు చేసుకోవడం ద్వారా అధిక కరెంట్ చార్జీల నుండి బయటపడవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ కాంప్లెక్స్ కమిటీ అధ్యక్షులు పరుచూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు వెలగపూడి శంకర్ బాబు, జాలాది వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కాసుల వెంకటనారాయణ, సెక్రటరీలు బివిఎస్. రమేష్, ఎస్ వి ఎస్ రామకృష్ణ, కోశాధికారి నంబూరు సాంబశివరావు, శ్రీ వాసవి ఫౌండేషన్ అధ్యక్షులు వివికె. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# టిట్కో గృహాలను పరిశీలించిన సబ్ కలెక్టర్...



**నూజివీడు జనవరి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నూజివీడు పట్టణ పరిధిలోని జగనన్న కాలనీ.. ఎంఆర్ అప్పారావు కాలనీలో ఉన్న టిట్కో గృహాల పనుల పురోగతిని సబ్ కలెక్టర్ బి వినూత్న గురువారం పరిశీలించారు, ఈ సందర్భంగా వినూత్న మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న 144 ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి ఉగాది నాటికి లబ్ధిదారులకు అందజేయాలని అధికారులను ఆదేశించారు, తిట్కో గృహాలలో జరుగుతున్న పనిని పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు, ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామోజీ నాయక్, మున్సిపల్ కమిషనర్ పిరయ్య, తహసిల్దార్ బద్రు, హౌసింగ్ ఏఈ వరుణ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 20వ డివిజన్ బీజేపీ అభ్యర్థిగా కొమ్ము గట్టయ్య నామినేషన్!!

- కాషాయ దళంతో కలిసి భారీ ర్యాలీ
- మోడీ నాయకత్వమే మాకు స్ఫూర్తి
- ఒక్క అవకాశం ఇవ్వండి.. డివిజన్ రూపురేఖలు మారుస్తా
- వినమ్రంగా వేడుకున్న గట్టయ్య



**పెద్దపల్లి/ గోదావరిఖని: జనవరి 29 (వార్తాప్రభ ప్రతినిధి)**రాబోయే రామగుండం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో 20వ డివిజన్ బిజెపి కార్పొరేటర్ అభ్యర్థిగా కొమ్ము గట్టయ్య యాదవ్ భారీ అనుచరవర్గం, పార్టీ కార్యకర్తలు, ముఖ్య శ్రేణులతో కలిసి తన నామినేషన్‌ను ఘనంగా దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...... ప్రధాని నరేంద్ర మోడీ సమర్థవంతమైన నాయకత్వాన్ని బలపరుస్తూ, దేశాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే లక్ష్యంతో తాను బరిలోకి దిగుతున్నట్లు స్పష్టం చేశారు. డివిజన్ ప్రజలు తన అభ్యర్థిత్వాన్ని ఆశీర్వదించి, కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిరంతరం ప్రజల చెంతనే ఉంటూ డివిజన్ సమస్యల పరిష్కారానికి, సమగ్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని వినమ్రంగా హామీ ఇచ్చారు. అభివృద్ధిలో వెనుకబడిన 20వ డివిజన్‌ను మోడల్ డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన ప్రధాన అజెండా అని పేర్కొన్న ఆయన చేతులు జోడించి తనను గెలిపించాలని ప్రజలను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని ఆయనకు మద్దతుగా నినాదాలు చేస్తూ సందడి చేశారు.

## శ్రీవారి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడడం క్షమించరాని నేరం.. ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్..



**కృత్తివెన్ను వార్తప్రభ జనవరి 29:**ప్రపంచ దేశాల్లోని హిందువులందరూ పవిత్రమైన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో లడ్డు ప్రసాదాన్ని కల్తీ నెయ్యి తో తయారుచేసి వైసీపీ ప్రభుత్వం క్షమించరాని తప్పు చేసిందని పెడన నియోజకవర్గ శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. బంటుమిల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు ఎమ్మెల్యే నిర్వహించారు. చేసిన నేరానికి తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆగ్రహం వ్యక్తం చేశారు.తిరుమల తిరుపతి వెళ్లే ప్రతి భక్తుడు కళ్ళకు అద్దుకుని స్వీకరించే పవిత్ర ప్రసాదమైన లడ్డూలను గత ఐదేళ్ల పాలనలో నెయ్యి బదులు కెమికల్స్ వాడి కల్తీ చేయించారు ఇది భక్తుల మనోభావాలతో చెలగాటమాడిన మహా పాపం. 60 లక్షల లీటర్ల రసాయనాలతో తయారుచేసిన 20 కోట్ల లడ్డూలు ప్రజల ఆరోగ్యాన్ని హరించాయి. గత ప్రభుత్వ హయాంలో సరఫరా చేసిన నెయ్యి అసలు నెయ్యి కాకుండా పామాయిల్, పామోలిన్, కెమికల్స్‌తో తయారైన సింథటిక్ ద్రవమని, దానిలో 0 పాల కొవ్వు మాత్రమే ఉందని ల్యాబ్ నివేదికలు వెల్లడించాయి. సుమారు 60 లక్షల కిలోల కల్తీ నెయ్యితో దాదాపు 20 కోట్ల లడ్డూలను తయారు చేసి భక్తులకు పంపిణీ చేసినట్లు, దీని ద్వారా సుమారు ×251 కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు భక్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు....

## బలవంతపు భూసేకరణ ఆపాలి

**-అఖిలభారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ పిలుపు**



**మైలవరం:జనవరి 29 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దేశంలో ఎక్కడా లేని విధంగారాష్ట్రంలో బలవంతపు భూసేకరణ జరుగుతోందని,ఈ భూ సేకరణకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమానికి రైతులందరూ సిద్ధం కావాలని అఖిలభారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ పిలుపునిచ్చారు. ఔటర్ రింగ్ రోడ్ లో భూములు కోల్పోతున్న రైతులతో గురువారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ ఆవరణలో విజ్జు కృష్ణన్ సమావేశమ య్యారు.ఈ సందర్భంగా పలువురు రైతులు భూ సేకరణకు సంబంధించి తమకు సరైన సమాచారం ఇవ్వలేదని, అలైన్మెంట్ లో క్లారిటీ లేదని, 70 మీటర్ల అని తర్వాత 250 మీటర్లు తీసుకుంటామని రకరకాలుగా సమాధానాలు చెబుతున్నారని తమ ఆవేదనను వ్యక్తంచేశారు. అనంతరం విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ కేరళ, కర్ణాటక, పంజాబ్ లాంటి రా(ష్టాలలో రింగ్రోడ్డుల కోసం తక్కువ భూమిని సేకరించారని, కానీ ఏపీలో నిబంధనలు కు విరుద్ధంగా బలవంతపు భూసేకరణ జరుగుతుందన్నారు.గ్రామసభలు జరిపి రైతులను ఒప్పించి భూములు తీసుకోవాలి కానీ ఎలాంటి సమాచారం లేకుండానే రైతులకు నోటీసులు ఇవ్వడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం ప్రస్తుత ప్రైవేటు మార్కెట్ విలువ ప్రకారం నాలుగు రెట్లు భూమి కోల్పోతున్న వారికి ఇవ్వాలన్నారు. 99 పైసలకే లు లు కంపెనీకి రాష్ట్ర ప్రభుత్వం వేలాది ఎకరాలు కట్టబెడుతుందని, అదే తరహాలో ఔటర్ రింగ్ రోడ్డు పేరుతో రైతుల నుంచి భూములను లాక్కొని ఎవరికో లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తున్నారని దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పివి ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కోట కళ్యాణ్, రైతు సంఘం అధ్యక్షులు మద్దిరెడ్డి వెంకటరెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ సుధాకర్, మైలవరం మండల రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు, రైతు సంఘం నాయకురాలు వజ్రాల ధనలక్ష్మి, ఇసాక్, జి కొండూరు, మైలవరం మండలాల్లో భూములు కోల్పోతున్న రైతులు పాల్గొన్నారు.

# 301 బార్ లైసెన్సులకు రీ-నోటిఫికేషన్

● 2025--28 బార్ పాలసీ కింద తాజా డ్రా ఆఫ్ లాట్స్‌కు షెడ్యూల్ విడుదల



అమరావతి,జనవరి 29 (వార్తాప్రభ) : 2025--28 నూతన బార్ పాలసీ కింద రాష్ట్రవ్యాప్తంగా 301 ఓపెన్ కేటగిరీ బార్ లైసెన్సులను మళ్లీ నోటిఫై చేయాలని నిర్ణయించినట్లు ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ శ్రీధర్ చామకూరి ప్రకటించారు. డ్రా ఆఫ్ లాట్స్ విధానంలో ఇప్పటికే ఓపెన్ కేటగిరీలో 541 బార్లు, రిజర్వ్ కేటగిరీలో 84 బార్లు కేటాయించబడినప్పటికీ, 299 బార్లు ఇంకా కేటాయింపు పూర్తి కాలేదని చెప్పారు. గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున రెండు బార్లకు రీ-నోటిఫికేషన్‌కు అనుమతి ఇవ్వడంతో, మొత్తం 301 బార్లను మళ్లీ నోటిఫై చేయనున్నట్లు డైరెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. జిల్లాల వారీగా రీ-నోటిఫికేషన్ చేయనున్న బార్లలో ఎన్టీఆర్ (55), విశాఖపట్నం (52), గుంటూరు (42), ఎస్పీఎస్ నెల్లూరు (27), పల్నాడు (22), విజయనగరం (11), కృష్ణా (11), శ్రీకాకుళం (10), బాపట్ల (8), కాకినాడ (8), అనంతపురం (7), ఏలూరు (7), కడప (6), తూర్పు గోదావరి (5), కోనసీమ (5), చిత్తూరు (4), పీవీపీ మణ్యం (4), తిరుపతి (4), ప్రకాశం (3), అనకాపల్లి (2), కర్నూలు (2), శ్రీ సత్యసాయి (2), నంద్యాల (1), అన్నమయ్య (1) జిల్లాలు ఉన్నాయి. ఏఎస్ఆర్ పాడేరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ దశలో రీ-నోటిఫికేషన్ లేదు. డైరెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ, అప్లికేషన్ ప్రక్రియ ను అనుసరించి జిల్లా గెజెట్లో బార్ల జాబితా ఇప్పటికే ప్రచురించామని, తదనుగుణంగా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమవుతుందని తెలిపారు. ఆన్‌లైన్ / హైబ్రిడ్ / ఆఫ్‌లైన్ విధానాల్లో ఫిబ్రవరి 4, 2026 సాయంత్రం 6.00 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 5, 2026 ఉదయం 8 గంటలకు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో డ్రా ఆఫ్ లాట్స్ నిర్వహించబడతాయని, అదే రోజు ఎంపికైన వారికి తాత్కాలిక లైసెన్సుల మంజూరుపై సమాచారం అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత జిల్లా ఎక్సైజ్ అధికారులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని డైరెక్టర్ శ్రీధర్ ఆదేశించారు.

# హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి..

● స్వామి వారి లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగినట్లు తేలడం బాధాకరము..



గుడివాడ,జనవరి 29 (వార్తాప్రభ) : కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదం కల్తీ విషయంలో ప్రత్యేక సిట్ చేసిన దర్యాప్తులో స్వామి వారి లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగినట్లు తేలడం బాధాకరమని గుడివాడ లోని పలు దేవస్థానాల ధర్మకర్తల మండలి చైర్మన్ లు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పాటి మీద వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహించిన మీడియా సమావేశంలో దేవస్థానాల చైర్మన్లు మీడియాతో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం స్వామి వారి లడ్డు ప్రసాదంలో కల్తీ జరిగిందని సిట్ దర్యాప్తులో తేలినప్పటికీ వైసిపి నాయకులు ఎదురు దాడి చేయడం దారుణమని, హిందూ దేవుళ్ళ పై నోటికొచ్చినట్లు మాట్లాడుతూ హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్న వైసీపీ నాయకులకు ప్రజలు మరింత బుద్ధి చెబుతారని దేవస్థాన కమిటీ చైర్మన్ లు మండిపడ్డారు. ఈ ఘటనలో బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అలాగే భక్తుల పవిత్ర భావనలకు భంగం కలిగించిన ఈ ఘటనపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ క్రమంలో టిడిపి సీనియర్ నాయకులు పంద్రాజు సాంబశివరావు మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పవిత్రతను కాపాడుకోవడం ప్రతి హిందువు బాధ్యత అని, ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానం, శ్రీ భీమేశ్వరస్వామి వారి దేవస్థానము, శ్రీ వేణుగోపాలస్వామి వారి దేవస్థానము ల చైర్మన్లు లింగం చిట్టిబాబు, పట్టపు చిన్న, అంగదాల సతీష్ మరియు దేవస్థానముల ట్రస్ట్ బోర్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ నేత నాన్నయ్య పాడెమోసిన మొండితోక సోదరులు

● అంతిమయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, దేవినేని అవినాష్ వైసీపీ శ్రేణులు



నందిగామ,జనవరి 29 (వార్తాప్రభ) : మండల పరిధిలోని అంబారుపేట గ్రామానికి చెందిన ప్రముఖ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్, సత్యమ్మ తల్లి ఆలయ మాజీ చైర్మన్ గరికిపాటి భాస్కరం (నానయ్య) అంతిమయాత్రలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, మాజీ ఎమ్మెల్యే జనసేన జిల్లా పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను లు పాల్గొని పాడెను మోశారు. గురువారం అనారోగ్యంతో మృతి చెందిన నానయ్య పార్థివ దేహాన్ని జిల్లా పార్టీ అధ్యక్షులు దేవిని అవినాష్ తో కలిసి సందర్శించిన వైసీపీ శ్రేణులు ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు. అంతిమయాత్రలో పాడెమోసిన డాక్టర్ మొండితోక సోదరులు సామినేని ఉదయభానులు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నానయ్య మృతి చెందడం వైసిపికి తీరని లోటు అని బాధను వ్యక్తపరిచారు. నానయ్య అంతిమయాత్రలో భారీగా పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు భావోద్వేగంతో తుది వీడ్కోలు పలికారు.

# కంచల గ్రామంలో పశువుల ఆరోగ్య శిబిరం ప్రారంభం

● రాయితీపై ఇస్తున్న గోకులం షెడ్లను పశుగ్రాస విత్తనాలను సద్వినియోగం చేసుకోండి




నందిగామ,జనవరి 29 (వార్తాప్రభ) : స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య సూచనతో గురువారం మండల పరిధిలోని కంచల గ్రామంలో పశువుల ఆరోగ్య శిబిరాన్ని రైతులతో మరియు గ్రామ ప్రజలతో కలిసి గోమాతకు పూజ చేసి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి వీరాస్వామిన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరాస్వామి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకులకు అత్యధిక ప్రాధాన్యతమిస్తూ, బడ్జెట్లో తగిన నిధులు కేటాయిస్తూ వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నదని వీరంకి వీరాస్వామిన్ పేర్కొన్నారు. ముఖ్యంగా మన రాష్ట్రం దేశంలోని గేదెల సంఖ్య ఆరో స్థానంలోనూ, గొర్రెల సంఖ్యలో రెండవ స్థానంలోనూ, మరియు కోళ్ల సంఖ్యలో రెండవ స్థానంలోనూ, ఉందని పాలా ఉత్పత్తులు ఏడో స్థానం లో ఆంధ్రప్రదేశ్ ఉందని వీరాస్వామిన్ తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి సంక్షేమ లో ముందుకు తీసుకెళుతున్న గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి శ్రీపవన్ కళ్యాణ్ లకు కూటమి నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞత తెలియజేశారు. ప్రభుత్వం రాయితీపై ఇస్తున్న అన్ని రకాల సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం నిబంధన ప్రకారం అవసరం ఉన్నవారు గోకులం షెడ్లు మంజూరు చేస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని వీరాస్వామిన్ రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో వి ఏ ఎస్ చంద్రశేఖర్ నాయక్, కంచల వెటర్నరీ డాక్టర్ సుష్మ మరియు పశు వైద్య సిబ్బంది, గ్రామ నాయకులు రామిరెడ్డి సుబ్బారావు, రామిరెడ్డి శ్రీనివాసరావు, మందడపు వెంకట్రావు, చనమల రామచంద్ర మూర్తి, రామిరెడ్డి వీర రాఘవయ్య, మరియు గ్రామ ప్రజలు రైతులు పాల్గొన్నారు.

# గాదేపూడి గ్రామంలో సామాజిక ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం



పెడన,జనవరి 29 (వార్తాప్రభ) : వీర్నాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు వీర్నాల బాలాజీ వారి తండ్రి వీర్నాల నాంచారయ్య సంయుక్తంగా గాదేపూడిలోఆర్ వో ప్లాంట్ ను గురువారం ప్రారంభించారు. గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీటిని ఉచితంగా అందించడమే లక్ష్యంగా ఈ సేవా కార్యక్రమాన్ని వీర్నాల ఫౌండేషన్ చేపట్టింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి నరసింహులు ఎంపీడీఓ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.డి. ఇమ్రాన్ పెడన ఎంపీడీఓ అరుణ రెవెన్యూ అధికారి లోక రాజు గ్రామ రెవెన్యూ అధికారి పార్వతి సర్పంచ్ లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.ఓ. ప్లాంట్‌ను ఎండి వో పేరున లిఖితపూర్వకంగా రిజిస్ట్రేషన్ చేసి గ్రామానికి అంకితం ఇవ్వడం జరిగింది. అలాగే గుడివాడకు చెందిన షేక్ మహమ్మద్ రసూల్ అనే వినికిడి లోపంతో బాధపడుతున్న పేద బాలుడికి రూ.50 వేలు ఆర్థిక సహాయం వీర్నాల ఫౌండేషన్ తరపున అందించారు. అదేవిధంగా గాదేపూడి గ్రామ ప్రజలకు ఉచిత వాటర్ క్యాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీర్నాల ఫౌండేషన్ వ్యవస్థాపకులు వీర్నాల బాలాజీ మాట్లాడుతూ నీటి విలువను గుర్తించి నేటికీ గ్రామ ప్రజలు తాగునీటి కోసం పడుతున్న కష్టాన్ని దృష్టిలో పెట్టుకుని నా ఊరికి ఏదైనా చేయాలన్న సంకల్పంతో ఈ ఆర్ ఓ ప్లాంట్‌తో పాటు గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు కోసం సుమారు రూ.16 లక్షలు ఖర్చు చేసి గ్రామానికి అంకితం చేయడం ఎంతో ఆనందంగా ఉంది అని తెలిపారు.



ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె పాల్గొంటున్నా అని మున్సిపల్ వర్కర్స్ మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహార్ కి సమ్మె నోటీసు ఇస్తున్న దృశ్యం.. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దనాల సత్యనారాయ కస్తూరి రమేశ్ ముత్యాల ఏడుకొండలు దుర్గా ప్రసాద్ మునగాల శ్రీను ఆదినారాయణ మరియు సొసైటీ వర్కర్స్ పాల్గొన్నారు.

–గుడివాడ,జనవరి 29 (వార్తాప్రభ) :

# ఇన్చార్జి కలెక్టర్ ను కలిసిన ఏపీఎంఈయూ నాయకులు



కాకినాడ,జనవరి 29 (వార్తాప్రభ) : ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గురువారం జిల్లా ఇన్చార్జ్ కలెక్టర్ ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా నూతన కార్యవర్గ సభ్యుల జాబితా, రాష్ట్ర నాయకత్వం పంపిన అప్రూవల్ లేఖను జిల్లా ఇంచార్జ్ కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి అందజేసినట్టు సంఘ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్యాలెండరు ఆవిష్కరణ చేశారు. అనంతరం జాబితా లేఖ కాపీలను జిల్లా ఆరోగ్యశాఖ సమన్వయ అధికారి, జి.జి.హెచ్. సూపరింటెండెంట్, నర్సింగ్ సూపరింటెండెంట్ కి అందచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డిప్యూటీ స్టేట్ జనరల్ సెక్రటరీ బుడ్డిగ స్వామిబాబు, ఏఐటియుసి జనరల్ సెక్రెటరీ తోకల ప్రసాద్, జీజీహెచ్ కాకినాడ శాఖ అధ్యక్షులు కట్టిమేను మోహనరావు, ఏపీఎంఇయు జిల్లా ప్రెసిడెంట్ ఎ.పద్మావతి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఈగల కుమారస్వామి, జిల్లా కోశాధికారి పి. రాణి, జాయింట్ సెక్రెటరీలు వట్టిప్రోలు ప్రసన్నకుమార్, వారాది సత్యనారాయణ, ఈసీ మెంబర్ డి. విజయ్ కుమార్, బి. జీవిత, కె.ప్రమీల, ఏ.హెచ్ జి.కుమారి, ఎ.రోజామణి తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరరావుకు నివాళులర్పించిన ఎమ్మెల్యే



కోడూరు,జనవరి 29 (వార్తాప్రభ) : కోడూరు గ్రామానికి చెందిన అరజా ఉమా మహేశ్వరరావు ఇటీవల మృతి చెందారు. గురువారం అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, మహేశ్వర రావు చిత్రపటం వద్ద పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి సాయిబాబు, స్థానిక జనసేన నాయకులు కోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మానవ సేవయే మాధవ సేవ..

-శ్రీ గౌరీశంకర స్వామి వారి దేవస్థానం ఈ.వో. గోపాలరావు



గుడివాడ,జనవరి 29 (వార్తాప్రభ) : స్థానిక గౌరీ శంకరపురంలో వేంచేసి ఉన్న శ్రీ గౌరీ శంకర స్వామి వారి దేవస్థానం నందు ప్రతి నెల ఆఖరి గురువారం శ్రీ సాయిబాబా వారి మందిరం నందు భక్తుల సహాయ సహకారములతో అన్న సమారాధన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణ అధికారి కందుల వేణుగోపాల్ రావు మాట్లాడుతూ దానములలో గొప్పది అన్నదానం అని మానవ సేవయే మాధవ సేవగా భావించి అందరు ఒక్కటే ( సబ్ కా మాలిక్ ఏక్ హై ) అనే శ్రీ శిరిడి సాయిబాబా వారి సూక్తి ముక్తావాళి ని అనుసరించి భక్తులు సహాయ సహకారంతో అన్నదానం నిర్విరామముగా ప్రతి నెల ఆఖరి గురువారం నిర్వహించబడుచున్నది అని పేర్కొన్నారు. అలాగే ఈ రోజు అన్న సమారాధనలో సుమారుగా 1500 మందికి పైగా భక్తులు పాల్గొన్నారని గోపాలరావు తెలిపారు. ధర్మకర్తల మండలి చైర్మన్ నెరుసు సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ స్వామివారి అన్నదాన కార్యక్రమంనకు విరాళములు అందజేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అర్చక స్వాములు మరియు గౌరీ శంకర్ స్వామి వారి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు భక్తులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మృత్యువులోనూ.. మరో ఇద్దరికి చూపు..

● వాసవి జాగృతి క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో 10వ జత నేత్రాల సేకరణ



గుడివాడ,జనవరి 29 (వార్తాప్రభ) : తాను మరణించినా.. ఆమె కళ్లు మాత్రం ఈ లోకంను చూస్తూనే ఉన్నాయి. మరో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించింది. గుడివాడ –వలివర్తిపాడు రోడ్డులో నివాసము ంటున్న కొత్త గజలక్ష్మి మంగళవారం సాయంత్రం గుండెపోటుతో మృతిచెందినారు. వారి కుటుంబ సభ్యులైన భర్త పాండురంగారావు అల్లుడు కృష్ణకాంత్ కుమార్తె భార్గవి సమ్మతితో వాసవి జాగృతి క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో ఎల్ వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ టెక్నీషియన్ మహేష్ ద్వారా కార్నియాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శేగు బబిత మాట్లాడుతూ గజలక్ష్మి గారి వద్ద సేకరించిన కార్నీయాలు ద్వారా మరో ఇరువురికి చూపుని ఇవ్వవచ్చని తెలియజేశారు. ఈ సందర్భంగా నేత్రదానం చేసిన కుటంబ సభ్యులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు శేగు వెంకట ప్రసాద్ కార్యదర్శి, నేత్రదాన ప్రోత్సాహకులు గాదె మోహన్ బాబు మరియు కంతేటి హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ ధారణ పై అవగాహన

## అతివేగం ప్రమాదం : ఎంవిఐ ప్రసాద్



పెద్దాపురం,జనవరి 29 (వార్తాప్రభ) : రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ మౌనిక ల ఆధ్వర్యంలో హెల్మెట్ ధరించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎం వి ఐ ప్రసాద్ మాట్లాడుతూ మోటార్ సైకిల్ నడిపే ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అదేవిధంగా ఆటోలు కూడా పరిమితి మించి అధికంగా ప్రయాణికులను ఎక్కించుకొని రాదని, వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు తప్పనిసరిగా ఫోర్సులో ఉండాలని, అలాగే ద్విచక్ర వాహనం నడిపే వారు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రిపుల్ రైటింగ్ (ద్విచక్ర వాహనం పై ముగ్గురు) ప్రయాణించడం నేరమన్నారు. మద్యం సేవించి , సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదు అని అన్నారు. వాహనదారులందరూ రేష్ డ్రైవింగ్ ,అధిక వేగం అత్యంత ప్రమాదకరం అని, సిగ్నల్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవాలి ఎంవిఐ ప్రసాద్ సూచించారు. ముఖ్యంగా వాహనాలను మైనర్లకు ఇవ్వరాదని , వాహనదారులు ఖచ్చితంగా డ్రైవ్ లైసెన్స్ కలిగి ఉండాలి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది ,ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా భీష్మ ఏకాదశి వేడుకలు




గుడివాడ,జనవరి 29 (వార్తాప్రభ) : స్థానిక పామర్రు రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో భీష్మ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు పేద పండితులు శ్రీమాన్ చలమచర్ల మురళీ కృష్ణమాచార్యులు పర్యవేక్షణలో శ్రీ స్వామివారిని వెన్నతో అలంకరించి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఆల్ ఇండియా సాఫ్ట్ బాల్ పోటీలకు ఏఎన్ఆర్ కళాశాల విద్యార్దులు



గుడివాడ,జనవరి 29 (వార్తాప్రభ) : ఈ నెల 24, 25 తేదీలలో కృష్ణా విశ్వ విద్యాలయ స్పోర్ట్స్ బోర్డు, ఆంధ్ర లయోలా కళాశాల క్రీడా ప్రాంగణములో నిర్వహించిన కృష్ణా విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొన్న ఏ.ఎన్.ఆర్. కళాశాల విద్యార్థులు టి. ప్రభుకుమార్ రాజు (ఎం.బి.ఎ. మొదటి సంవత్సరం), డి. శివశంకర్ (బి.ఎస్.సి. తృతీయ సంవత్సరం) లు అత్యధిక ప్రతిభ కనబరచి ఆల్ ఇండియా సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక అయ్యారని.. వీరు కృష్ణా విశ్వవిద్యాలయ సాఫ్ట్ బాల్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.జె.ఎస్. కుమార్ తెలియ జేసారు. ఈ సందర్భంగా కళాశాల పాలక వర్గ ప్రెసిడెంట్ యల్.ఆర్.కే. ప్రసాద్, సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ కె.ఎస్. అప్పారావు లు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమములో వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.పద్మజ, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి, అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది విజేతలను అభినందించారు.

# కాకమానును సన్మానించిన కంకిపాడు గ్రామ టిడిపి నాయకులు



కంకిపాడు/పెనమలూరు,జనవరి 29 (వార్తాప్రభ) : కంకిపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, న్యాయవాది కాకమోను రమేష్ ను సాంస్కృతిక సంఘ సేవ సంస్థ కళానిలయం వారు ఆయన చేసిన సంఘ సేవలకు, అడ్వకేట్ గాను గుర్తించి గణతంత్ర దినోత్సవం వేడుకలు, సంక్రాంతి స్వర్ణనంది పురస్కారాలు భాగంగా హైదరాబాదులోని తెలంగాణ సరస్వతి పరిషత్ అబిడ్స్ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో నంది పురస్కారాన్ని ప్రశంస పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కంకిపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు టిడిపి పార్టీ కార్యాలయంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. టిడిపి జిల్లా అధికారి ప్రతినిధి తుమ్మలపల్లి హరికృష్ణ మాజీ సిహెచ్సి చైర్మన్ యలమంచిలి కిషోర్ బాబు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోగినేని రమణ, గ్రామ టిడిపి నాయకులు శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా తుమ్మలపల్లి హరికృష్ణ మాట్లాడుతూ అవార్డు పొందిన రమేష్ ను అభినందించి, టిడిపి నాయకులు కార్యకర్తలు ఐక్యంగా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# ఉచిత శిక్షణ కార్యక్రమం

గుడివాడ,జనవరి 29 (వార్తాప్రభ) : స్థానిక కే. బి. ఆర్. గవర్నమెంట్ ఐటిఐ కాలేజ్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహించబడుతున్న స్కిల్ హబ్ లో సెక్యూరిటీ అనలిస్ట్ అనే కోర్సును 3 నెలలపాటు ఉచిత శిక్షణా తరగతులు అందిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి డా పి.నరేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలియపరిచారు. ఈ కోర్స్ లో జాయిన్ అవ్వడానికి విద్యార్హత ఇంటర్మీడియట్, ఈక్వల్ టు ఇంటర్/ఆపైన ఉండాలి. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు ఉపయోగించుకోవాలని ఐటిఐ ప్రిన్సిపాల్/ కన్వీనర్ ఓ. మంజులా దేవి తెలియపరచారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు జరుగుచున్నవి. ఇతర సందేహాల నివృత్తి కోసం 9848819682, 9666654641 నెంబర్లను సంప్రదించాలనీ కోరారు.

# వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే స్మార్ట్ సిటీస్ పనుల్లో వెనుకబడ్డ ఏపీ - ఎంపీ పుట్టా మహేష్ కుమార్

● దేశవ్యాప్తంగా 100 నగరాల్లో స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టు పనులు. ● పెండింగ్ పనుల్లో ఏపీ టాప్. రెండో స్థానంలో హర్యానా. ● కేంద్ర నిధులను గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించడం వల్లే పనులు పూర్తికాలేదన్న ఏలూరు ఎంపీ.



**ఏలూరు/ఢిల్లీ,జనవరి 29 (వార్తాప్రభ) :** గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టు పనుల్లో ఆంధ్రప్రదేశ్ వెనుకబడినట్లు బయటపడింది. స్మార్ట్ సిటీస్ మిషన్ పనుల పురోగతిపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో కేంద్ర గృహనిర్మాణం మరియు పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి టోఖాన్ సాహు సమాధానం ఇచ్చారు. ఈ వివరాలను మీడియాకు విడుదల చేశారు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. కేంద్ర మంత్రి ఇచ్చిన వివరాలను పరిశీలిస్తే.. స్మార్ట్ సిటీస్ మిషన్ (రాజీవ్) కింద, మిషన్ ప్రారంభించినప్పటి నుండి దేశ వ్యాప్తంగా 1,64,811 కోట్ల విలువైన మొత్తం 8,064 ప్రాజెక్టులు చేపట్టబడ్డాయి. అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అందిన సమాచారం ప్రకారం 15.01.2026 నాటికి ?1,55,859 కోట్ల విలువైన 7,767 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. 8,952 కోట్ల విలువైన మొత్తం 297 ప్రాజెక్టులు ఇంకా కొనసాగుతున్నాయి. 2015-16లో స్మార్ట్ సిటీస్ మిషన్ కింద భారత ప్రభుత్వం దేశవ్యాప్తంగా 100 నగరాలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఇందులో ఆంధ్రప్రదేశ్ నుంచి అమరావతి, విశాఖపట్నం, కాకినాడ, తిరుపతి ఉన్నాయి. గురువారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు కేంద్ర మంత్రి ఇచ్చిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ లోని నాలుగు నగరాల్లో 6,589 కోట్ల విలువైన 280 ప్రాజెక్టులు ప్రారంభించగా, ఇప్పటివరకూ 249 ప్రాజెక్టులు పూర్తి కాగా, 31 ప్రాజెక్టులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వీటిలో భాగంగా ఇంకా 850 కోట్ల విలువైన పనులు చేయాల్సి ఉంది. దేశంలోని మరే రాష్ట్రంలోనూ ఈ స్థాయిలో ఎస్సీ ఏం ప్రాజెక్టులు పెండింగ్‌లో లేవు. దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో 20 వేల కోట్లకు పైగా విలువైన స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టులు చేపట్టగా 5 తప్పితే మిగిలిన పనులన్నీ పూర్తయ్యాయి. ఏపీ స్మార్ట్ సిటీస్ ప్రాజెక్టుల పనులు పూర్తి కాకపోవడంపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పందించారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే పనులు పూర్తి కాలేదని, కేంద్ర నిధులను వైసీపీ ప్రభుత్వం ఇతర పథకాలకు మళ్లించడంతో పాటు, రాష్ట్ర వాటా నిధులు ఇవ్వకపోవడంతోనే స్మార్ట్ సిటీస్ మిషన్ లో ఏపీ వెనుకపడిందని ఎంపీ విమర్శించారు. స్మార్ట్ సిటీలలో పట్టణ నిర్వహణను మెరుగుపరచడానికి ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేసి, సేఫ్టీ అండ్ సర్వైలెన్స్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్, ఇ-గవర్నెన్స్ అండ్ గ్రీవెన్స్ రిడ్రెసల్, వాటర్ సప్లై అండ్ శానిటేషన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, హెల్త్, ఎడ్యుకేషన్ మరియు ఇతర పౌర-కేంద్రీకృత సేవలతోపాటు ఇంటెలిజెంట్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మానిటరింగ్ అండ్ మేనేజ్‌మెంట్, ఫ్లడ్ అండ్ డిజాస్టర్ మానిటరింగ్, సీసీటీవీ సర్వైలెన్స్, ఎన్విరాన్‌మెంటల్ మానిటరింగ్, వంటి ప్రాజెక్టుల కోసం కేంద్రం భారీగా నిధులు విడుదల చేస్తోంది.

# కోట్లాది మంది భక్తులు విశ్వాసానికి ప్రతీక తిరుమల లడ్డు తయారీలో వైకాపా నాయకులు కుంభకోణాలకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచాయి

● తిరుమలలో చేసింది మహా పాపం అదే వైసిపి పార్టీ వాళ్ళకు పెద్ద శాపం- వాళ్ళు చేసిన పాపాన్ని ఎన్నటికీ ప్రజలు క్షమించరు ● రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి.



**ఏలూరు/నూజివీడు,జనవరి 29 (వార్తాప్రభ) :** నూజివీడు మండలం నూజివీడు పట్టణంలో గురువారం వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డు తయారీలో కల్తీ జరిగినట్లు సిట్ నివేదిక ద్వారా స్పష్టత అయిందని, వైకాపా నాయకులు చేసిన కుంభకోణాలు బట్టబయలైన కారణంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు మేరకు స్థానిక శ్రీశక్తి భవనం నుండి ర్యాలీగా శ్రీ వెంకటాచల స్వామివారి దేవస్థానానికి చేరుకుని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి శుద్ధి కార్యక్రమాలు మరియు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం కల్తీ నెయ్యి అంశంపై మీడియా మిత్రులతో మంత్రి కొలుసు పార్థసారథి పత్రికా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ మహా పాపం నిజం – 68.17 లక్షల కిలోల కల్తీ నెయ్యి అది నెయ్యే కాదు ! పామాయిల్, కెమికల్ కలిపిన ద్రవం ! లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కేసులో సిట్ స్పష్టీకరణ చేసిందని అన్నారు. ఆ కల్తీ నెయ్యితోనే శ్రీవారి ఆలయంలో 20 కోట్ల లడ్డు ప్రసాదాలు తయారీ, వైసిపి పెద్దలకు రూ 251 కోట్లను తమజేబుల్లో వేసుకున్నారని అతి పెద్ద స్కామ్ అన్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో కల్తీ జరిగిందని సిట్ నివేదిక ద్వారా స్పష్టంగా వెలుగులోకి రావడం అత్యంత దిగ్భ్రాంతి కరమైన విషయం, బాధాకరం అన్నారు. కోట్లాది మంది భక్తులు విశ్వాసానికి ప్రతీక అయిన తిరుమల లడ్డు తయారీలో జరిగిన ఈ అవకతవకలు, వైకాపా నాయకులు చేసిన కుంభకోణాలకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తున్నాయని అన్నారు. సిట్ నివేదికలో వెల్లడైన అంశాలు అప్పటి ప్రభుత్వ పెద్దల నిర్లక్ష్యం, బాధ్యతా రాహిత్యం మరియు అవినీతిని స్పష్టంగా చూపిస్తున్నాయని తెలిపారు. పవిత్ర మైన శ్రీవారి ప్రసాదాన్ని కూడా రాజకీయ లాభాలు కోసం, వ్యక్తిగత స్వార్థాల కోసం కల్తీ చేయడం అనేది క్షమించరాని నేరమని అన్నారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాదు కోట్లాది మంది భక్తుల మనోభావాలపై చేసిన దాడిగా భావించాలని అన్నారు. ఈ వ్యవహారంపై వైకాపా నాయకులు ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. తప్పుచేసిన వారిని గుర్తించి, కఠినమైన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే భక్తుల విశ్వాసాన్ని తిరిగి పొంద గలుగుతామని అన్నారు. ఈ కుంభకోణంలో భాగస్వాములైన వారెవరైనా సరే, రాజకీయ హోదాలు, పదవులు పక్కనపెట్టి చట్టప్రకారం శిక్ష పడాల్సిందేనని అన్నారు. తిరుమల శ్రీవారి పవిత్రతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్తులో ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ అంశంపై సమగ్రవిచారణ జరిపి మరింత నిజాలను పూర్తిగా ప్రజలు ముందుకు ఉంచాలని, ఇంతటి దారుణానికి చేసిన వారిని తప్పక శిక్షలు పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, కూటమి నాయకులు, భక్తులు, పట్టణ ప్రజలు, ఎక్కువ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఓబిసి కాంగ్రెస్ చైర్మన్ లతో పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి సమావేశం



**పెడన,జనవరి 29 (వార్తాప్రభ) :** ఏపీ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి స్టేట్ ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ శొంఠి నాగరాజు ఆధ్వర్యంలో రాష్ట్ర ఓబీసీ కమిటీకి సంబంధించిన జిల్లా చైర్మన్లు స్టేట్ జనరల్ సెక్రటరీలు, సెక్రటరీలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ ప్రస్తుత స్థితిగతులపై సమగ్రంగా చర్చిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఓబీసీ కమిటీల నిర్మాణం వాటి పనితీరు భవిష్యత్ కార్యాచరణపై లోతైన సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల పేద బడుగు బలహీన వర్గాల ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారని, ముఖ్యంగా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఈ సందర్భంగా షర్మిల రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర ను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఈ యాత్రను అనంతపురం జిల్లా నుండి ప్రారంభించి అన్ని జిల్లాల్లో విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ యాత్ర ద్వారా ఉపాధి హామీ పథక ప్రాముఖ్యతను ప్రజలకు వివరించడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ఎండగట్టాలని లక్షలాది కార్మికుల హక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు. ప్రత్యేకంగా ఓబీసీ వర్గాలను ఏకతాటిపైకి తీసుకువచ్చి ప్రతి ఒక్కరిని కలుపుకుంటూ సంఘటితంగా పనిచేయాలని, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు బలమైన ఉద్యమంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించాలని జిల్లా చైర్మన్లకు స్పష్టమైన దిశా నిర్దేశాలు చేశారు. ప్రతి జిల్లాలో విస్తృత స్థాయిలో సమావేశాలు ర్యాలీలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్టేట్ ఓబీసీ కాంగ్రెస్ చైర్మన్ శొంఠి నాగరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పేదల జీవనాధారం అని దీనిని పరిరక్షించుకోవడం కోసం కాంగ్రెస్ పార్టీ అన్ని స్థాయిల్లో ఉద్యమాన్ని చేపడుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఓబీసీ శక్తిని సమీకరించి రాబోయే యాత్రను చారిత్రాత్మక విజయంగా నిలిపేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ పార్టీ పేద బడుగు బలహీన వర్గాల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందనే విషయాన్ని మరోసారి స్పష్టంగా చాటిందని నాయకులు పేర్కొన్నారు.

# విద్యా విధానంలో లోకేష్ తీసుకొస్తున్న మార్పులు అభినందనీయం - ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ



**కాకినాడ,జనవరి 29 (వార్తాప్రభ) :** శాసనమండలి సభ్యురాలు కర్రి పద్మశ్రీ నారాయణరావు 29 గురువారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన విద్యావ్యవస్థ పై తీసుకుంటున్న నిర్ణయాలు రాబోయే తరాల విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఏర్పాటు అవుతుందని తమ అభిప్రాయం లోకేష్ కు తెలిపామని ఎమ్మెల్సీ పద్మశ్రీ అన్నారు. అలాగే విద్యార్థులకు ఏ విధంగా మంచి జరుగుతుందో వారిని సూచనలు సలహాలు ఇవ్వవలసిందిగా లోకేష్ ఆదేశించినట్టు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యార్థులకు వారి ప్రతిభను నిరూపించుకునేందుకు ప్రభుత్వం తరపున చేస్తున్న స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం, మధ్యాహ్న భోజన పథకంలో తీసుకువచ్చిన మార్పులపై ప్రజలు అందరూ సంతోషంగా ఉన్నట్టు లోకేష్ కి తెలుపమని అలాగే కాకినాడజీఎన్టీయూ యూనివర్సిటీ , ఆదికవి నన్నయ యూనివర్సిటీ, వంటి యూనివర్సిటీలో విద్యార్థులు వారి ప్రతిభను బట్టి చదువుకునే విధంగా కోర్సులు ఏర్పాటు చేస్తే బాగుంటుందని చెప్పామని దీన్ని పరిశీలించి అమల్లో పెడతామని లోకేష్ అన్నారు కర్రి పద్మశ్రీ నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. మీ మార్గదర్శకత్వంలో అమలవుతున్న యువత కోసం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వృత్తి మార్గదర్శక కార్యక్రమాలు, మెగా తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశాలు, ఆరోగ్యం మరియు పరిశుభ్రత కోసం ముస్తాబు కార్యక్రమం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం బలోపేతం, అలాగే 10వ తరగతి, ఇంటర్మీడియట్ మరియు డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న జాబ్ మేళాలు అత్యంత ప్రశంసనీయమైనవి. తీర ప్రాంతంలో నివసిస్తున్న సాంప్రదాయ మత్స్యకారులు, మత్స్యకారుల కుటుంబాల్లో విద్యావంతులకు తగిన విధంగా ఉద్యోగ అవకాశాలు, స్కిల్ డెవలప్మెంట్ గురించి సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# అత్యాధునిక సౌకర్యాలతో వైద్యశాల ఏర్పాటుకు శ్రీకారం

● ప్రపంచ సువార్తికుల మిషనరీ క్రీస్తు సంఘం ఫౌండర్ చైర్మన్ గంటా ఫిలిప్










**విస్సన్నపేట,జనవరి 29 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో పుట్రేల గ్రామంలో అత్యాధునిక సౌకర్యాలతో 150 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసేందుకు 20 26 ద్వితీయార్థంలో శ్రీకారం చుట్టనున్నట్లు ప్రపంచ సువార్తికుల క్రీస్తు సంఘం ఫౌండర్ చైర్మన్ పుట్రెల క్రిస్టియన్ యూనివర్సిటీ చైర్మన్ గంటా ఫిలిఫ్ తెలియజేశారు. తన కుమార్తె ఎండి మెడిసిన్ చదువుతోందని ఉన్నత వైద్యం 50% జనరల్ వైద్యంతో పాటు పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించనున్నామన్నారు . ఉచిత విద్య – ఉచిత వైద్యం లక్ష్యంగా తన లక్ష్యాలను దేవుని దయ కృపాకటాక్ష వీక్షణాలతో ముందుకు తీసుకువెళ్లడం జరుగుతుందని ఆయన చెప్పారు. 150 పడకల ఆసుపత్రి మూడు(50+50+50) విడతలగా నిర్మాణం జరుగుతోందని పేదలందరికీ వైద్యం అందించేందుకు ప్రపంచంలోని అన్ని దేశాల నుండి డాక్టర్లు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని అంబులెన్స్ లు అల్ట్రా మోడల్ దిగుమతి చేసుకుంటున్నామని రోడ్డు ప్రమాదం జరిగిన సమయంలో స్పాట్ లో ఆక్సిజన్ అందిస్తూనే మానవ శరీరానికి గుచ్చుకుని ఉన్న రాడ్లు కట్ చేసి వాహనంలో ఇరుకుకు పోయిన ప్రాంతశీ నుండి ప్రమాదంలో ఉన్న వారిని కాపాడి వారికి ప్రాణం పోసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రెండువేల మంది విద్యార్థులు చదువుకునే విధంగా మహిళా కళాశాలలో నిర్మించడం జరుగుతోందన్నారు. సర్వాంగ సుందరంగా నభూతో నభవిష్యతి అన్న చందంగా వెయ్యి మంది పాల్గొనే ఆడిటోరియంను మహిళా కళాశాల శిలాఫలకాన్ని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు ట్రాఫిక్ ఎస్.కె షర్విన్ బేగం ప్రారంభించారు. ఆసుపత్రి సేవలు ప్రారంభమయ్యే నాటికి ఏబిసిడి నాలుగు వర్గాలుగా విభజించి వారికి ఆరోగ్య కార్డులు అందిస్తామని ఆర్థిక వసులుబాటు లేని వారికి అన్ని ఉచితంగా వైద్య సేవలుతో మందులు అందిస్తామని, నూతనంగా ప్రారంభమైన ఆడిటోరియం రెవెన్యూ పోలీస్ వైద్య శాఖలకు సభలు సమావేశాలకు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. పేదరికంలో ఉన్న వారిని ఆదుకునే లక్ష్యంగా ఆయా కుటుంబాల అనుమతులతో వారి పిల్లలను ప్రత్యేక విమానాలలో ప్రపంచ నలుమూలల నుండి పుట్రేలకు తీసుకువచ్చి మెరుగైన విద్యను అందిస్తున్నామని ఆయన వివరించారు. 150 మంది పేద కుటుంబాలకు చెందిన పిల్లలను మణిపూర్ నుండి తీసుకువచ్చి స్కూల్ డ్రెస్, బూట్లు, ఆహారం ప్లస్ టు విద్య వరకు స్థానికంగా అందించనున్నామని చెప్పారు. దేవుని నమ్ముకున్న వారికి మంచి జరుగుతోందని ఆర్థిక సహాయం చేసే సమయంలో తనకు కులమతాలతో సంబంధం లేదన్నారు. మూడు కుటుంబాలకు గేమ్స్, ఎడ్యుకేషన్, లైబ్రరీ తదితర రంగాలకు సంబంధించి లక్ష రూపాయలు ఆయన ఆర్థిక చేయూత అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ మేడ శ్రీనివాసరావు రెండు లక్షల రూపాయలు చెక్కుతో పాటు దుప్పట్లు తన వంతు సేవే లక్ష్యంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఎంఎస్ఎస్ అశోక్ బాబు, మైలవరం ఏసిపి వై ప్రసాదరావు,డాక్టర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌జీయూకేటీ--నూజివీడులో జాతీయ క్వాంటం కంప్యూటింగ్ వర్క్‌షాప్ మూడో రోజు



**నూజివీడు,జనవరి 29 (వార్తాప్రభ) :** ఆర్జీయూకేటీ నూజివీడులో నిర్వహిస్తున్న "క్వాంటం కంప్యూటింగ్ అన్వేషణ: మౌలికాంశాల నుంచి అల్గోరిథంల వరకు ప్రాయోగిక అనుభవంతో" ఐదు రోజుల జాతీయ వర్క్‌షాప్ మూడో రోజుకి కొనసాగింది. మూడో రోజు క్వాంటం కంప్యూటింగ్‌కు సంబంధించిన మౌలిక భాగాలు మరియు భౌతిక సూత్రాలపై దృష్టి సారించిన సాంకేతిక సెషన్లతో ఈ వర్క్ షాప్ కొనసాగింది. ఈ సాంకేతిక సెషన్లకు ప్రొఫెసర్ (డా) జి. భగవన్నారాయణ, మాజీ చీఫ్ సైంటిస్ట్ మరియు ఆర్కేవ్యాలీ పూర్వ సంచాలకులు నాయకత్వం వహించారు. ఆయన క్వాంటం గేట్లు మరియు క్వాంటం సర్క్యూట్లు వంటి క్వాంటం ప్రోగ్రామింగ్ నిర్మాణ బ్లాక్స్‌పై విస్తృత ఉపన్యాసం ఇచ్చారు. ఈ సెషన్ ద్వారా క్వాంటం సర్క్యూట్లు క్వాంటం అల్గోరిథంలు మరియు గణనాత్మక నిర్మాణాలకు ఎలా పునాది అవుతాయో పాల్గొన్నవారికి స్పష్టమైన అవగాహన లభించింది. మరో ముఖ్యమైన సెషన్‌ను డా. హెచ్. అశ్వత్ బాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్, భౌతికశాస్త్ర విభాగం, ఐఐటీ ధార్వాడ్ నిర్వహించారు. ఆయన క్వాంటం భౌతికశాస్త్రంలోని ఆధునిక భావనలు మరియు వాటి అనువర్తనాలపై ప్రసంగించారు. క్వాంటం కంప్యూటేషన్‌కు ఆధారమైన భౌతిక సూత్రాలను వివరిస్తూ, ప్రస్తుత మరియు భవిష్యత్ క్వాంటం సాంకేతికతల్లో వాటి ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. ఈ వర్క్‌షాప్‌ను ఆర్జీయూకేటీ నూజివీడు భౌతికశాస్త్ర విభాగం, క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్ సహకారంతో నిర్వహిస్తోంది. నిర్వాహక కమిటీలో డా. జి. దుర్గబాబు (కన్వీనర్), డా. యు. పవని, శ్రీ పి. వినోద్, డా. ఏ. బ్రహ్మాస్వాములు, మరియు శ్రీ ఎ. సుధీర్ కుమార్ (కో-కన్వీనర్లు) సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీతో పాటు ఆర్జీయూకేటీ నూజివీడు విద్ అధ్యాపకులు మరియు విద్యార్థి వాలంటీర్లు వర్క్‌షాప్‌ను సజావుగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ సెషన్లలో విద్యార్థులు, పరిశోధనా విద్యార్థులు మరియు అధ్యాపకులు చురుకుగా పాల్గొనడం వల్ల వర్క్‌షాప్ మూడో రోజు అకడమిక్‌గా సమృద్ధిగా మరియు పరస్పర చర్చలతో సాగింది. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ మరియు నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్, పరిపాలనాధికారి డా. లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డా. సాదు చిరంజీవి ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

# మహిళలు స్వశక్తితో ఎదగాలని ఆనాడే ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా, మెప్మా గ్రూపులకు శ్రీకారం

● నేడు మహిళలు వ్యాపార వేత్తలుగా రాణిస్తున్నారు అంటే ఆనాడు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న చర్యలే కారణం. ● కుటుంబంలో ప్రతి మహిళను ఒక వ్యాపారవేత్తగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ● రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



**ఏలూరు/ నూజివీడు,జనవరి 29 (వార్తాప్రభ) :** నూజివీడు పురపాలక సంఘం పరిధిలో గురువారం స్త్రీశక్తి భవనంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) మహాజన సభలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మెప్మా మహిళలతో మమేకం అయ్యారు. పట్టణంలో 990 గ్రూపులు ద్వారా 10,115 మంది మహిళలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరు అయిన రుణాలు, పెట్టుకున్న వ్యాపారాలు, పొందుతున్న లాభాలను, విజయగాథలను వివరించారు. వారి చెప్పిన వ్యాపారాలు, విజయగాథలు విని మంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు. వ్యాపారాలు బాగా చేసుకుని స్ఫూర్తిగా నిలిచిన మహిళలను మంత్రి కొలుసు పార్థసారథి సన్మానించి, అభినందించారు . ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ మాట్లాడుతూ పేదలు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను మహిళా సంఘాలు సమర్థవంతంగా వినియోగిం చుకోవాలని అన్నారు. మహిళలు అందరూ తప్పకుండా చదువుకో వాలని, సమాజంలో అనేక రకాలైన మోసాలు జరుగు తున్నాయని వీటన్నింటి నుండి మనల్ని మనం కాపాడుకోవాలంటే చదువు ఒక్కటే మార్గం అన్నారు. మహిళలు సాధికారతకు పెద్దపీట వేసిన మన ముఖ్యమంత్రి సుమారు 30 సంవత్సరాలు క్రితమే డ్వాక్రా, మెప్మాగ్రూపులు ఏర్పాటు ద్వారా మహిళలు చిరు వ్యాపారాలతో ఆర్థికంగా ఎదుగుతూ వ్యాపార వేత్తలుగా మారడానికి బాటలు వేశారన్నారు. ముఖ్యంగా స్వయం సహాయక సంఘాలు ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలని, డ్వాక్రా, మెప్మా ద్వారా అందుతున్న రుణాలు, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని, మహిళలు ఆర్థికంగా బలుపేతం కావాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతే రాష్ట్ర అభివృద్ధికి మూలమని, రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ మహిళా సంఘాలకు అండగా ఉంటుందని, మీకు ఏమి కావాలన్నా నెరవేర్చుటకు అన్ని వేళలు అందుబాటులో ఉంటానని భరోసానిచ్చారు. ఈ సమావేశంలో మెప్మా పిడి పి.మాధవి, వివిధ బ్రాంచీలు బ్యాంకు మేనేజర్లు, మునిసిపల్ వైస్ చైర్‌పర్సన్ పగడాల సత్యనారాయణ, కౌన్సిలర్సు, మెప్మా సాంకేతిక నిపుణులు పార్వతి, మహాలక్ష్మి, దుర్గాచౌదరి, మెప్మాద్వారా రుణాలు పొందిన వివిధ సంఘాలు ప్రెసిడెంట్లు, సభ్యులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# నారా లోకేష్ కాకినాడ పర్యటనకు విస్తృత ఏర్పాట్లు పరిశీలించిన రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు





**కాకినాడ,జనవరి 29 (వార్తాప్రభ) :** తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ నెల 30వ తేదీ శుక్రవారం కాకినాడ పర్యటన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేయాలని రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు అధికారులకు, పార్టీ శ్రేణులకు ఆదేశించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాష్ట్ర విద్యా, ఐటి శాఖ మంత్రివర్యులు నారా లోకేష్ కాకినాడ పర్యటనలో భాగంగా జరగనున్న కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లను రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్‌తో కలిసి ఇతర పార్టీ నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అచ్చంపేట మెడికవర్ ఆసుపత్రి సమీపంలో కాకినాడ రూరల్ నియోజకవర్గం టిడిపి నాయకుల సమావేశం సంబంధించి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు..కాకినాడ జేఎన్టీయూ, కాకినాడ రూరల్ మండలం వలసపాకల జంక్షన్ బీచ్ రోడ్డులో నూతనంగా నిర్మించిన కోరమాండల్ ఆసుపత్రి, వద్దా చేపట్టిన ఏర్పాట్లను కూడా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు పరిశీలించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు మాట్లాడుతూ... ఈ నెల 30న రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కాకినాడ జేఎన్టీయూ క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం జేఎన్టీయూ ప్రాంగణంలో నిర్వహించనున్న "హలో లోకేష్" కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో ప్రత్యక్షంగా మమేకమవుతారని చెప్పారు. అంతకుముందు విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి నారా లోకేష్ సందర్శిస్తారని పేర్కొన్నారు. అనంతరం కాకినాడ రూరల్ మండలం వలసపాకల వద్ద నూతనంగా నిర్మించిన కోరమాండల్ ఆసుపత్రిని మంత్రి నారా లోకేష్ ప్రారంభిస్తారని, అక్కడి నుంచి అచ్చంపేటలోని మెడికవర్ ఆసుపత్రి వద్ద నిర్వహించనున్న కాకినాడ రూరల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారని వివరించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు నారా లోకేష్ దిశానిర్దేశం చేయనున్నట్లు తెలిపారు. మంత్రి నారా లోకేష్ పర్యటనను విజయవంతం చేయడానికి అధికారులు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారని సానా సతీష్ బాబు తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో జేఎన్టీయూ వైస్ చాన్స్‌లర్ సి.ఎస్.ఎన్.వి. ప్రసాద్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ, టిడిపి సీనియర్ నాయకులు, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత తోట నవీన్, గుణ్ణం చంద్రమౌళి, డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్, కాకినాడ కోరమాండల్ ఇంటర్నేషనల్ మ్యానుఫ్యాక్చరింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (హెడ్) ఎం. జ్ఞానసుదరం, హెడ్ సీఎస్ఆర్ జయగోపాల్ ఛతుర్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ దినేష్, సీనియర్ జీఎం (హెచ్ఆర్) పి. పద్మనాభన్‌తో పాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188